వార్త
ఆదివారం
19 ఫిబ్రవరి, 2023

# కమ్మనైన అమ్మభాష





# 'శాకుంతలం' ఏప్రిల్ 14న విడుదల

స్టార్ హీరోయిన్ సమంత నటించిన లేటెస్ట్ పాన్ ఇండియా మూవీ 'శాకుంతలం'. ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళం భాషల్లో విడుదలవుతున్న సంగతి విదితమే. గుణశేఖర్ దర్శకత్వంలో, సమంత ప్రధాన పాత్రధారిగా ఈ చిత్రం రూపొందింది.

కాళిదాసు రచించిన 'అభిజ్ఞాన శాకుంతలం' ఆధారంగా గుణశేఖర్ సొంత బ్యానర్‌లో ఈ సినిమాను నిర్మించారు. ఇందులో దుష్యంతుడిగా దేవ్‌మోహన్ కనిపించనున్నాడు. ఈ సినిమాను ఏప్రిల్ **14**న విడుదల చేస్తున్న చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.

## తారాతీరం



# రామ్‌చరణ్-కియారా అద్వానీ జంటగా..

పాన్ ఇండియా స్టార్ హీరో, మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా, డైరెక్టర్ శంకర్ దర్శకత్వంతో తెరకెక్కుతున్న పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ ఆర్‌సి**15**. ఈ చిత్రానికి టైటిల్ ఖరారు చేయాల్సి ఉంది. ఈ పాన్ ఇండియా సినిమాలో కియారా అద్వానీ కథానాయికగా నటిస్తోంది.

ఈ చిత్రానికి సంబంధించిన షూటిం గు శరవేగంగా జరుగుతోంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని దిల్ రాజు తన హోమ్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. అంజలి, శ్రీకాంత్, ఎస్.జె.సూర్య కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకి థమన్ సంగీతం అందించారు.

ఆదివారం వార్త

sunmagvaartha@gmail.com

19 ఫిబ్రవరి, 2023

## మంచి ముత్యాలు

వస్తు దారిద్ర్యానికి సులువుగా చికిత్స చేయవచ్చుకాని,
ఆత్మ దారిద్ర్యానికి చికిత్స అసాధ్యం.

- మైఖల్ మాంటైన్

## విషయ విశేషం


నీళ్ల అలారమ్ బాటిల్... 4

'సంఘీ'భావం....5

మానవాళిని వణికిస్తోన్న భూకంపాలు

కవర్ స్టోరీ..6

కమ్మనైన

అమ్మభాష

చిత్ర కెరటం!...10

ఈవారం కవిత్వం..12

కొన్ని పరిమళాలు

దయగల దైవం దభళేశ్వరం...14

ఐస్‌క్రీమ్‌ను తినేద్దాం....18

కథ.. 20

కాంతులీనుతున్న మనసు

తెలుగు 'నాటు-నాటు' పాటకు.....23

తొలి విద్యాకేంద్రం నలంద.....25

నిజాయితీ విలువ..30

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..




## తాజా వార్తలు

### అభివృద్ధి పథంలో..

ఉత్తరప్రదేశ్‌లోని హసుడి ఔసన్‌పూర్ నాలుగేళ్ల క్రితం వరకు ఏమాత్రం అభివృద్ధి చెందని గ్రామంగా ఉండేది. కానీ.. ఈ మధ్య ఏడు జాతీయ, రెండు రాష్ట్రస్థాయి అవార్డులను దక్కించుకుని అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ఒకప్పుడు టెక్నాలజీకి ఆమడ దూరంలో ఉన్న హసుడి స్మార్ట్ గ్రామంగా తనదైన ముద్ర వేసిందంటే అందుకు కారణం సర్పంచ్ దిలీప్ త్రిపాఠీ. రాజకీయాలతో ఎవరికి వారుగా ఉండే గ్రామస్థుల్ని ఏకతాటి మీదకు తీసుకొచ్చాడు. పంచాయతీ భవనాన్ని ఆధునీకరించి అడ్మినిస్ట్రేషన్ కోసం కంప్యూటర్లను ఏర్పాటు చేశాడు. ఊరంతా ఉచిత వైఫై, వీధికో సిసీ టీవీ కెమెరా, సోలార్ వీధిదీపాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, ఆర్వో వాటర్ ప్లాంట్ మొదలైన సౌకర్యాలను కల్పించాడు. ప్రతి ఇంటి ప్రహరీకి గులాబీ రంగులు వేయించాడు. ఆడపిల్ల పుడితే ఆర్థికంగా ప్రోత్సాహకం అందిస్తూ మహిళా సాధికారత దిశగా కృషి చేస్తున్నాడు. గ్రామం చుట్టుపక్కల ఇటుక బట్టీలు ఉండటంతో స్వచ్ఛమైన గాలికోసం నలుమూలలా గాలి శుద్ధి యంత్రాలను అమర్చాడు. ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ ల్యాబ్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి గదికీ ఏసీ పెట్టించాడు. 'మిషన్ మంగళ్' సినిమా చూసిన త్రిపాఠి ఓ స్పేస్ స్టార్టప్‌ను సంప్రదించి ఇస్రో సహాయంతో ఈ మధ్యనే స్పేస్ ల్యాబ్‌ను సైతం ఏర్పాటు చేశాడు.

#### ఐకమత్యంతో..

మధ్యప్రదేశ్‌లోని నర్సింగ్‌పూర్ జిల్లా కరేలి మండలంలో భగువర్ గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ ఈ గ్రామంలో సర్పంచ్ పదవికి ఎన్నిక జరగలేదు. గ్రామస్థులకు తలలో నాలుకగా వ్యవహరిస్తూ వచ్చిన భయ్యాజీని అక్కడి వారంతా గౌరవిస్తారు. ఆయన అడుగుజాడల్లో నడిచే ప్రజలు భగువర్ అభివృద్ధిలో తమ వంతుగా పాలుపంచుకుంటున్నారు. గాంధీ సిద్ధాంతాన్ని నమ్మే భయ్యాజీ గ్రామానికొచ్చే నిధులతో ఇంటింటా ఇంకుడు గుంతలను తవ్వించాడు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశాడు. రోడ్లు శుభ్రంగా ఉంచుకుంటూ పచ్చదనానికి ప్రాధాన్యమిచ్చేలా చూశాడు. అదే విధంగా గోబర్‌గ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేసి గ్రామంలో చాలా ఇళ్లల్లో వంట, వీధిలైట్లకు ఆ గ్యాస్‌నే వినియోగించేలా ప్రోత్సహించాడు భయ్యాజీ. దేశంలో ప్లాస్టిక్ వ్యతిరేక ఉద్యమం మొదలుకాకముందే అక్కడ ఆ వస్తువుల్ని నిషేధించాడు.







# నీళ్ల అలారమ్ బాటిల్

శరీరంలో తగినంత నీరు లేకపోవడం ప్రమాదానికి చిహ్నం. ఈ పరిస్థితి అనేక సమస్యలకు దారి తీస్తుంది. చాలాసార్లు పని ఒత్తిడిలో నీళ్ల తాగడం మర్చిపోతుంటాం కూడా. ఆ ఇబ్బంది లేకుండా మనలాంటి వారికోసమే వచ్చేసింది 'ఫిల్ అప్' వాటర్ బాటిల్. 'ఫ్లూయిడ్స్ స్టాన్స్' సంస్థ రూపొందించిన ఈ బాటిల్‌లో నీళ్ల ఎన్ని గంటలైనా చల్లగానే ఉంటాయి. అంతేకాదు, నిర్దేశించిన సమయాల్లో నీళ్ల తాగమని హెచ్చరిస్తుందీ బాటిల్. కప్పుతో వచ్చే ఈ బాటిల్‌ను వెంట తీసుకెళ్లవచ్చు. ఆ రోజుకు సరిపడా నీటిని ఒక్కసారి నింపితే చాలు.





# 'సంఘీ' భావం



## మానవాళిని వణికిస్తోన్న భూకంపాలు

ప్రకృతి వైపరీత్యాల్లో ఒకటైన భూకంపాలు గత దశాబ్దకాలంగా మానవాళిని వణికిస్తున్నాయి. ప్రపంచంలోనే కాకుండా మన దేశంలోను, తెలుగురాష్ట్రాల్లోను అప్పుడప్పుడు తమ ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ప్రస్తుతం తాజాగా టర్కీ, సిరియాల్లో సంభవించిన భూకంపాలు ప్రపంచ దేశాలకు పొంచి ఉన్న ముప్పు విషయంలో ఆలోచింపచేసేవిగా ఉన్నాయి. భూమి పొరల్లో జరిగే మార్పులతో భూమి ఉపరితలంపై ప్రకంపనలు పుట్టిస్తాయి. ఇవి రిక్టర్ స్కేలుపై 4.0 వరకు చూపిస్తే పెద్దగా ప్రమాదం ఉండదు. అయితే ఈ పరిధి దాటితే ఆస్తి, ప్రాణనష్టం సంభవిస్తుంది. టర్కీ, సిరియాల్లో కేవలం 24 గంటల్లో దాదాపు వంద నుంచి 120 సార్లు భూకంపం వచ్చిందని రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో చాలా భవనాలు నేలమట్టం అయ్యాయి. మన దేశంలో కూడా భూకంపాలు తీవ్రప్రభావాన్ని చూపించిన ఘటనలు ఉన్నాయి. 2001లో గుజరాత్‌లో కచ్ జిల్లాలో రెండు నిమిషాల పాటు భూమి కంపించింది. మోమెంట్ మాగ్నిట్యూట్ స్కేలుపై 7.7 గా నమోదైంది. ఈ ప్రభావం పాకిస్థాన్‌పై కూడా చూపించింది. కొన్ని వందల గ్రామాలు నేలమట్టం అయ్యాయి. సుమారు 12 వేల మంది మృతిచెందారని అధికారులు ప్రకటించారు. 1993లో మహారాష్ట్ర లాతూర్, ఒసామాబాద్‌లలో భూకంపం సంభవించింది. సుమారు 52 గ్రామాలు పూర్తిగా నాశనం అయ్యాయి. పదివేల మంది ప్రజలు మృతి చెందారు. రిక్టర్ స్కేలుపై తీవ్రత 6.2గా నమోదు అయ్యింది. రాజస్థాన్‌లో కూడా తరచూ భూకంపాలు సంభవిస్తున్నాయి. న్యూఢిల్లీలోని పలు ప్రాంతాలు భూకంప జోన్‌లో ఉన్నట్లు పర్యావరణ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. అదేవిధంగా పలు నగరాలు, ప్రాంతాల్లో భూకంపాలు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. హైదరాబాద్ శివారు ప్రాంతంలో ఉన్న రాజేంద్రనగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో 2016లో భూకంప ప్రకంపనలు వచ్చాయి. దీనితో కొన్ని ఇళ్లు బీటలు వారాయి. తెల్లవారుజామున ఈ ఘటన జరగడంతో స్థానికులు భయపడి రోడ్లపైకి వచ్చారు. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో నాగర్ కర్నూలులో 2021లో భూకంపం వచ్చింది. రిక్టర్ స్కేల్‌పై 4.0గా నమోదు కావడంతో నష్టం వాటిల్లలేదు. రామగుండం, కరీంనగర్, మంచిర్యాల, ఆసీఫాబాద్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో కూడా ప్రకంపనలు వచ్చాయి. దీనితో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. టర్కీ, సిరియా వంటి దేశాల్లో భూకంపాలతో విధ్వంసం జరిగినప్పుడు ఇక్కడి ప్రజలు తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. అయితే ఇతర దేశాలతో పోలిస్తే భూకంపాల ప్రభావం ఆమేరకు ఉండదని పరిశోధనలు చెబుతున్నాయి. అయినప్పటికీ ముందు జాగ్రత్తతో ఇళ్లు, భవనాల నిర్మాణాలు జరగాలని ఇంజనీర్లు అభిప్రాయ పడుతున్నారు. తరచూ భూకంపాలు ఎక్కువగా వచ్చే జపాన్, నేపాల్, ఈక్వెడార్, ఫిలిప్పీన్స్, మెక్సికో, ఇండోనేషియా, చిలీ, పెరూ, ఇరాన్, అజోరిన్, పోర్చుగల్, న్యూజిలాండ్, గ్రీస్, ఇటలీలో ముందు జాగ్రత్తలు తీసుకుని భవననిర్మాణాలు చేస్తారు. వాస్తవానికి టర్కీలో వచ్చిన స్థాయిలో భూకంపం జపాన్‌లో వస్తే ప్రాణ నష్టం, ఆస్తినష్టం చాలా తక్కువగా ఉంటుంది. అక్కడ భవన నిర్మాణాలు భూకంప ప్రభావానికి తట్టుకునే విధంగా నిర్మిస్తారు. అదేవిధంగా ముందుగా భూకంపాలను పసిగట్టడానికి ప్రత్యేక విభాగాలు ఉన్నాయి. అంతేకాకుండా ఎప్పటికప్పుడు భూకంప ప్రభావిత ప్రాంతాల్లో పరిశోధనలు జరుపుతూ తగిన చర్యలు తీసుకుంటూ ఉంటారు. మిగిలిన దేశాలతో పోలిస్తే భూకంప ప్రభావం తట్టుకునే విధంగా నిర్మాణాలు మన దేశంలో జరగడం లేదు. ఆధునిక విధానాలను తీసుకువచ్చినా ఇక్కడి ప్రజలు వాటిని అనుసరించేందుకు అనుకూలంగా ఉండటం లేదు. భూమి పొరల్లో మార్పులు రావడానికి కొంతమేర జీవన విధానాల్లో మార్పులు కూడా తోడు అవుతున్నాయి. భారీకట్టడాలు, నీటి ప్రాజెక్ట్‌ల ప్రభావం కూడా భూకంపాలకు దోహదం అవుతుందని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. భూమిపై సుమారు 20 రకాల పలకలు ఉంటాయి. ఈ పలకలు నిరంతరం కదులుతూనే ఉంటాయి. ఏటా 20 వేల భూకంపాలు వస్తుంటాయి. ఈ లెక్కన రోజుకు 50 వరకు భూప్రకంపనాలు ఉంటాయి. దక్షిణ కాలిఫోర్నియాలో ఏటా దాదాపు పది వేల భూంకపాలు వస్తున్నాయని రికార్డులు చెబుతున్నాయి. కాగా భూకంపాల్లో 80 శాతం వరకు పసిఫిక్ మహా సముద్రంలోనే వస్తుంటాయి. పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ ప్రాంతంలోసుమారు 452 అగ్ని పర్వతాలు ఉన్నాయి.

అమెరికలో అత పెద్ద భూకంపం 1964 మార్చి 28న వచ్చింది. అప్పుడు రిక్టర్ స్కేల్ ఏకంగా 9,5 గా రికార్డు అయింది. అదేవిధంగా భూకం పాల వల్ల సముద్రం అల్లకల్లోలం అవుతుంది. 2004 డిసెంబరు 26వ తేదీన భారీ భూకంపంతో హిందూ మహా సముద్రంలో సునామీ వచ్చింది. దీనివల్ల 11 దేశాల్లో 2,25,000 మంది చనిపోయారు. భూకంపాలు ఇటీవల కాలంలో కొంతమేర పెరిగాయని రికార్డుల ద్వారా తెలుస్తోంది. ముందు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మాత్రమే కొంతవరకు ప్రాణ, ఆస్థి నష్టాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

మాతృభాష గొప్పదనం మాటల్లో వర్ణించలేనిది. భావ వ్యక్తీకరణకు సులభమైన, సులక్షణమైన మార్గం అమ్మభాష. అందుకే గాంధీ మాతృభాష గురించి ఇలా అన్నారు "మాతృభాషా తృణీకారం, మాతృదేవీ తిరస్కారం" అని రెండు పంక్తుల్లో మాతృభాష ప్రాశస్త్యాన్ని చాటిచెప్పారు.



# కమ్మనైన అమ్మభాష

కవర్ స్టోరీ

ఈదర శ్రీనివాసరెడ్డి

ప్రతి జాతి సంస్కృతి వికాసానికి మూలం మాతృభాష. ప్రపంచీకరణ నేపథ్యంలో భాషా వికాసం పెరిగింది. అయితే మనుగడ కోసం ఇతర భాషలు నేర్చుకోవడంలో తప్పులేదు కానీ వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా జాగ్రత్తపడాలి. తమ తమ మాతృభాషలను కాపాడుకోవాలని గుర్తు చేసేందుకే 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం' జరుపుకుంటున్నారు. యునెస్కో సుస్థిరమైన సమాజం కోసం సాంస్కృతిక, భాషా వైవిధ్యం ప్రాముఖ్యతను విశ్వసించడం వల్ల భాషా, సాంస్కృతిక వైవిధ్యం, బహు భాషా వాదాన్ని ప్రోత్సహించడానికి అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఫిబ్రవరి 21న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు.

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకోవాలనే ఆలోచనను ఐక్యరాజ్యసమితి విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ 1999లో ప్రారంభించింది. ఇతరుల పట్ల, ఇతర భాషల పట్ల, ఇతర మతాల పట్ల సహనం, గౌరవాన్ని పెంపొందించే సంస్కృతులు, భాషలలోని వ్యత్యాసాలను పరిరక్షించడం ద్వారా శాంతిని నెలకొల్పవచ్చు అని ఐక్యరాజ్యసమితి గాఢంగా నమ్ముతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో భాషలు అంతరించిపోతున్నాయని యునెస్కో ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచ వ్యాప్తంగా 40 శాతం జనాభాకు వారు మాట్లాడే లేదా అర్థం చేసుకునే భాషలో విద్య అందుబాటులో లేదని యునోస్కో వర్గాలు పేర్కొంటున్నాయి. అందువల్ల మాతృభాష ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడంలో నిబద్ధతగా, ముఖ్యంగా పాఠశాల స్థాయిలో మార్చి 22ను అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా పాటించాలని నిర్ణయించింది.

1947లో భారతదేశం, పాకిస్తాన్ విభజన జరిగినప్పుడు పాకిస్తాన్ భౌగోళికంగా రెండు వేర్వేరు భాగాలుగా ఏర్పడింది. ఒకటి తూర్పు పాకిస్తాన్(ప్రస్తుత బంగ్లాదేశ్), రెంవది పశ్చిమ పశ్చిమ పాకిస్తాన్(ప్రస్తుత పాకిస్తాన్). ఒకే దేశంగా ఏర్పడినా సంస్కృతి, భాష మొదలైన వాటిలో రెండూ ఒకదానికొకటి చాలా భిన్నంగా ఉండేవి. ఈ రెండు భాగాలనూ నైసర్గికంగా భారతదేశం వేరు చేస్తుంది. తూర్పు పాకిస్తాన్(ఇప్పుడు బంగ్లాదేశ్), పశ్చిమ పాకిస్తాన్(ఇప్పుడు పాకిస్తాన్) కలిపి మెజారిటీ ప్రజలు బెంగాలీ లేదా బంగ్లా భాష ఎక్కువగా మాట్లాడేవారు. 1948లో అప్పటి పాకిస్తాన్ ప్రభుత్వం ఉర్దూను పాకిస్తాన్ జాతీయ భాషగా ప్రకటించింది. దీనికి తూర్పు పాకిస్తాన్ ప్రజలు అభ్యంతరం తెలిపారు. తూర్పు పాకిస్తాన్ జనాభాలో ఎక్కువ భాగం బెంగాలీ మాట్లాడతారు. ఉర్దూతో పాటు బెంగాలీ కూడా జాతీయ భాషలలో ఒకటిగా ఉండాలని వారు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను తూర్పు పాకిస్తాన్‌కు చెందిన ధీరేంద్రనాథ్ దత్తా 1948 ఫిబ్రవరి 23న పాకిస్తాన్ రాజ్యాంగ సభలో లేవనెత్తారు. తూర్పు పాకిస్తాన్ ప్రజలు (ప్రస్తుతం బంగ్లాదేశ్) నిరసనలు చేపట్టారు. భాష సమాన హోదా కోసం ఉద్యమం చేపట్టారు. ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి పాకిస్తాన్ ప్రభుత్వం 144 సెక్షన్, ర్యాలీలు మొదలైన ఢాకా నగరంలో నిషేధించింది. ఢాకా విశ్వవిద్యాలయం విద్యార్థులు, సాధారణ ప్రజల సహకారంతో భారీ ర్యాలీలు, సమావేశాలు ఏర్పాటు చేశారు. 1952 ఫిబ్రవరి 21న ర్యాలీలో పాల్గొన్న వారిపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో సలాం, బర్కాట్, రఫీక్, జబ్బర్, షఫియూర్ మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. చరిత్రలో ఇది చాలా అరుదైన సంఘటన. ప్రజలు తమ మాతృభాష కోసం ప్రాణాలను అర్పించటం మనం ఎక్కడా చూసివుండం. పోలీసుల దాడికి నిరసనగా ముస్లింలీగ్‌లోనివారు అదే రోజు పార్లమెంటరీ పార్టీకి రాజీనామా చేశారు. ఉద్యమం పెరుగుతున్న నేపథ్యంలో, పాకిస్తాన్ కేంద్ర ప్రభుత్వం చివరకు దిగి వచ్చింది.

1954 మే 8న పాకిస్తాన్ రాజ్యాంగ సభలో బెంగాలీని రాష్ట్ర భాషలలో ఒకటిగా స్వీకరించారు. 1956లో పాకిస్తాన్ మొదటి రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు, ఆర్టికల్ 214లో బెంగాలీ, ఉర్దూలను పాకిస్తాన్ రాష్ట్ర భాషలుగా పేర్కొంది. 1971లో బంగ్లాదేశ్ స్వతంత్రమైనప్పుడు, బెంగాలీ ఏకైక రాష్ట్ర భాషగా ప్రవేశపెట్టబడింది.

యునెస్కో బంగ్లా భాషా ఉద్యమం, మానవ భాష సాంస్కృతిక హక్కులను పురస్కరించుకుని 1999 ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ప్రకటించింది. బంగ్లాదేశీయులు (అప్పటి తూర్పు పాకిస్తానీయులు) చేసిన భాషా ఉద్యమానికి నివాళిగా ప్రతి ఏటా ఈ అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

మానవుడు పుట్టినప్పటి నుండి సహజంగా నేర్చుకుని మాట్లాడగలిగే భాష మాతృభాష లేదా మాతృభూమిలో మాట్లాడే భాష. తెలంగాణ లేదా ఆంధ్ర రాష్ట్రాలు తమ మాతృభూమిగా గలవారు మాట్లాడే భాష (తెలుగు) మాతృభాష. చక్కగా మాట్లాడగలిగే, అర్థం చేసుకోగలిగే, భావాలను వ్యక్తపరచగలిగే భాషను ప్రథమ భాషగా గుర్తించవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణాలో అనేక భాషలు మాట్లాడేవారు ఉన్నారు. 90 శాతం మంది తెలుగు మాట్లాడుతారు. కారణం.. వీరి మాతృభాష 'తెలుగు'. అలాగే ఉర్దూ, తమిళం, కన్నడ, ఒరియా, హిందీ భాషలు ప్రథమ భాషగా గలవారు కనిపిస్తారు. ఒక ప్రాంతంలో నివసిస్తూ వుంటే, ఆ ప్రాంతపు వ్యావహారిక భాషను కూడా మాతృభాషగా పరిగణించవచ్చు. తెలుగు భాషను తన మాతృభాషగా కలిగివున్నవాడు ఇతర భాషలు మాట్లాడగలిగి వుండవచ్చు. భారతీయ విద్యావిధానంలో 'త్రిభాషా సూత్రము' అవలంబించబడుతున్నది. తెలుగు మాతృభాష కలిగివుండేవారు హిందీ(దేశ భాష)ని రెండవ భాషగా, ఆంగ్లమును మూడవ భాషగా నేర్చుకుని తీరాలి. ఒక భాష అనే కాదు.. ఎన్నో భాషలు మనకు ఉన్నాయి. జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో 19,500 కంటే ఎక్కువ భాషలు లేదా మాండలికాలు మాతృభాషలుగా మాట్లాడబడుతున్నాయి. భారతదేశంలో 10,000 లేదా అంతకంటే ఎక్కువ మంది ప్రజలు మాట్లాడే భాషలు 121 వరకు ఉన్నాయి. 121 భాషలను రెండు భాగాలుగా విభజించవచ్చు. భారత రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చబడిన భాషలు 22. ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చని భాషలు 99 భాషలు. రాజ్యాంగంలోని ఎనిమిద షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా షెడ్యూల్ చేయబడిన భాషలు: అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, హిందీ, కన్నడ, కాశ్మీరీ, కొంకణి, మళయాళం, మణిపురి, మరాఠీ, నేపాలీ, ఒరియా, పంజాబీ, సంస్కృతం, సింధీ, తమిళం, తెలుగు, ఉర్దూ, బోడో, సంతాలి, మైథిలి, డోగ్రీ. వీటిలో 14 భాషలను మొదట రాజ్యాంగంలో చేర్చారు. సింధీ భాష 1967లో జోడించబడింది. ఆ





తర్వాత కొంకణి, మణిపురి, నేపాలీ అనే మూడు భాషలు 1992లో చేర్చబడ్డాయి. 2004లో బోడో, డోగ్రీ, మైథిలి, సంతాలి జోడించబడ్డాయి. ఆదిలాబాద్, వరంగల్, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఖమ్మం జిల్లాల్లో వందలాది గిరిజన తెగలున్నాయి, వారి భాషలూ అనేకం. కోయంగ్(గోండి), కొలవర్‌గొట్టి(కొలామి), కోయ, కొండ, కువి, ఆదివాసి ఒరియా, సవర(సొరబాస), బంజారా.. ఇలా ఎన్నో భాషల్ని మాట్లాడుతుంటారు. మాతృభాషలో ప్రాథమిక విద్యాభ్యాసం కోసం ఎనిమిద

గిరిజన భాషా నిఘంటువులను డిజిటల్ రూపంలో భద్రపర్చారు. ఒక్కో భాషకూ ఒక్కో వెబ్‌సైట్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనా ఉంది.

అప్పుడే పుట్టిన పసిపిల్లలు ఏడ్చే ఏడుపు కూడా మాతృభాషలోనే ఉంటుందని జర్మనీకి చెందిన శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడైంది. అమ్మ గర్భంలో ఉన్న తొమ్మిది నెలల్లో చివరి మూడు నెలల సమయంలో తల్లిమాటలు వింటూ పిల్లలు మాతృభాష గురించి తెలుసుకుంటారని, పుట్టిన తర్వాత వారి ఏడుపు అదే భాషను ప్రతిఫలిస్తుందని తెలిసింది. పిల్లలు గర్భంలో ఉండగానే తల్లిమాటలు వింటూ ఉచ్చారణ గురించి తెలుసుకున్నారని స్పష్టమైంది. పిల్లలు వివిధ రకాల ధ్వనుల్లో ఏడ్చే సామర్థ్యాన్ని కలిగివున్నప్పటికీ మాతృభాషకే ప్రాధాన్యమిస్తున్నారని కూడా ఈ పరిశోధనలో తెలిసింది. అమ్మతో అనుబంధాన్ని పెంచుకోవటం కోసమే శిశువు తనకు తెలిసిన మొదటి విద్యను ఇలా ప్రదర్శిస్తుంటారు. భారతదేశంలో మొఘల్ సామ్రాజ్యాన్ని పరిపాలించిన బలవంతులైన చక్రవర్తుల్లో ఆఖరివాడైన ఔరంగజేబు విద్యాబోధన గురించి తన పెద్ద వయసులో గురువుకు రాసిన ఉత్తరంలో పలు వ్యాఖ్యలు చేశారు. మాతృభాషలో కాక తనకు విదేశీ భాష అయిన పర్షియాను మాధ్యమంగా స్వీకరించి విద్య నేర్పడం వల్ల తాను ముందుగా తెలియని భాష నేర్చుకునేందుకు కొన్ని సంవత్సరాలు, ఆపైన విద్యను అభ్యసించేందుకు మిగిలిన సంవత్సరాలు చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చిందని గుర్తు చేసుకున్నారు. మాతృభాషలోనో, దేశభాషలోనో విద్యాబోధన చేస్తే పిల్లలు మరింత తేలికగా నేర్చుకుని, మనోవికాసం కూడా బాగా జరుగుతుందని ఔరంగజేబు రాశారు.

జాతి ద్వారా భాషకు, భాష ద్వారా జాతికి విశిష్ట గౌరవం దక్కుతుంది. ఏ ప్రగతిశీల జాతికైనా భాషే తల్లివేరు. ప్రజల నాలుకలపై జీవ చైతన్యంతో తొణికిసలాడాల్సిన భాష తన ఉనికిని కోల్పోయి అంతరించిపోవడమంటే ఏమిటి? ఏదైనా భాష తన ఉనికి పోగొట్టుకోవడమంటే కేవలం ఆ భాష అంతరించి పోయినట్లే కాదు, దాంతోపాటు ముడిపడి వున్న ఆ జాతి సంస్కృతి, సంప్రదాయాలు కూడా అంతరించినట్లే కదా! నేటి యువత ఆంగ్ల భాషలో చదివితేనే ఉద్యోగాలు అనే అభిప్రాయంతో ఉన్నది. నిస్సందేహంగా ఇది తప్పు వాదన.

మాతృభాషలో చక్కగా రాయడం, చదవడం వచ్చిన వారికే ఇతర భాషల్లో విస్తారమైన జ్ఞానం వస్తుంది. ఒక అపోహతో నేటి యువతరం అమ్మభాషకు దూరం అవుతున్నారు. ఈ ఎలక్ట్రానిక్ యుగంలో ఒక తరం మాతృభాషకు దూరమైతే మొత్తం ధ్వంసమైనట్లే. అలా కాకుండా చూసుకోవాల్సి బాధ్యత మనందరిది. మాతృ భాషపై నిర్లక్ష్యం 'మన కళ్లను మనమే పొడుచుకొని కర్ర సహాయంతో నడవడం వంటివి'. మాతృమూర్తికి, మాతృభాషకు ప్రత్యామ్నాయం లేవు. జ్ఞాన సముపార్జనకు విదేశీ భాష ఒక అవరోధంగా తయారై యువతర గ్రామీణ విద్యార్థులు తల్లడిల్లుతున్న కాలం ఇది. స్పష్టమైన భావ వ్యక్తీకరణ, ఉత్తమమైన ఆలోచనలు, ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని సంతరించుకోవడానికి ఇవన్నీ మాతృభాష ద్వారా సులభంగా సాధించవచ్చు. సర్టిఫికెట్ల కోసం ఉన్నత చదువులు, కేవలం ఉద్యోగాల కోసం విదేశాలు.. సారం లేని చదువుల తీరిది. యువత, ముఖ్యంగా గ్రామీణ యువత ఎంతో శక్తి సామర్థ్యాలు, ప్రతిభా పాటవాలున్నాయి. ఈ వైరుధ్యాల వల్ల ఎంతో కోల్పోతున్నారు. తెలుగులో చదవలేక, ఆంగ్లం అర్థం కాక సతమతమవుతున్నారు. అయితే ఈ ఇంగ్లీష్ భాష నేర్వటం అన్నది అవసరమూ, విజ్ఞాన సముపార్జన ధ్యేయం కావాలేగానీ మోజు కాకూడదు. ఈ మోజులో పడి మన మాతృభాషను నిర్లక్ష్యం చేయకూడదు. ఎగతాళి చేయకూడదు. కాబట్టి సుసంపన్నమైన మన భాషా సాహిత్య సౌందర్యాన్ని అవగాహన చేసుకోవడం, మన భాషను, సంస్కృతినీ కాపాడుకోవడం, భావి తరాల వారికి దీన్ని అందించడం ఆ భాషా సౌందర్య సంపదను కాపాడటం అందరి కర్తవ్యం.

"జనని సంస్కృతంబు సకల భాషలకు" అంటారు. మన జ్ఞానం మొత్తం ఇందులోనే దాగి వుంది. మనం మాట్లాడే చాలా మాటలు సంస్కృత భాషకు మనం దూరమై చాలా కాలమైంది. బ్రిటిష్‌వాళ్లు మన విద్యా విధానాన్ని పాడు చేసిన



క్రమంలో, సంస్కృతం మనకు దూరమైపోయింది. సంస్కృతాన్ని అభ్యసించడం, పరిరక్షించుకోవడం అత్యంత కీలకం.

దేశంలో ఎన్ని భాషలు ఏర్పడినా, సంస్కృతంలో అవలీలగా, అలవోకగా ఒదిగిన భాషల్లో ఒదిగిన భాషల్లో తెలుగుదే అగ్ర తాంబూలం. సంగీత, సాహిత్యాలకు జీవంపోసే రసపుష్టి తెలుగులో ఉన్నంతగా మిగిలిన భాషలకు లేదు. ఉర్దూ కూడా గొప్ప భాష. ఈ భాషలో రాజసం ఉంటుంది. మొన్న మొన్నటివరకు సంస్థానాలలో, రాజాస్థానాలలో సంగీత, సాహిత్యాలలో రాజ్యమేలిక భాష ఉర్దూ. ఇది భారతీయమైన భాష. ఇండో-ఆర్యన్ వర్గానికి చెందిన భాషగా దీనికి గుర్తింపు వుంది. ప్రపంచంలో ఎక్కువ మంది మాట్లాడే భాషల్లో ఉర్దూ 11వ స్థానంలో ఉంది. విద్యా బోధనలో, ఉద్యోగ ఉపాధిలో తెలుగును వెనక్కు నెట్టేస్తున్నారన్నది చేదు నిజం. అభివృద్ధి కోసం ఎన్ని భాషలు నేర్చుకున్నా, ఏ భాషలు ఎంత అవసరమైనా, తెలుగును విస్మరించకుండా ముందుకు వెళ్లడం చాలా ముఖ్యం. ఇంగ్లీష్ భాషలో బోధన అవసరమే అయినప్పటికీ, కనీసం 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగులో బోధన ఉండడం ముఖ్యం. ఒక సబ్జెక్టుగా తెలుగును తప్పనిసరిగా ఉంచడం కంటే, ఇంగ్లీష్ లేదా తెలుగులో విద్యాభ్యాసం చేసే సదుపాయం ఉండడం అత్యంత కీలకమని భాషా శాస్త్రవేత్తలు చెబుతున్న మాటలను గౌరవించడం ప్రభుత్వాల బాధ్యత. భారతీయ భాషలకు దక్కుతున్న ఈ గౌరవాలను చూసి, ఆనందిస్తూనే, మన తల్లిభాష తెలుగు గురించి మరింత ఆలోచించాల్సిన సమయం వచ్చేసింది. అత్యంత ప్రాచీన భాషలలోను మనకు హోదా దక్కింది. దీన్ని సాధించుకోడానికి రాజకీయంగా పెద్ద ఉద్యమమే చేయాల్సి వచ్చింది. మన తోటి దక్షిణాది భాషల్లో కన్నడ లిపికి, మన లిపికి ఎన్నో సారూప్యతలు ఉన్నాయి. నిన్న మొన్నటి వరకూ రెండూ కలిసే ఉన్నాయి. మన కంటే కాస్త ముందుగా తమిళం సొంత పదాలు సృష్టించుకొని, స్వాతంత్ర్యం పొందింది. మన జాను తెనుగు, అచ్చ తెనుగు వికసించినా, సంస్కృత భాషా సంపర్కం మన భాషకు వన్నెలద్దుతూనే ఉంది. అందరూ ఇంగ్లీష్‌లో వున్నన్ని మాటలు మరే నుడిలో లేవని అంటారు. కానీ తెలుగులో వున్నన్ని మాటలు మరే భాషలో లేవు. తెలుగులో ఎక్కువ మాటలు ఉండటానికి ఒక కారణముంది.

ప్రపంచ వ్యాప్తంగా తెలుగు చాలా ఎక్కువ ప్రాంతాల్లో వ్యాపించి ఉంది. ఎప్పుడూ ఒకే రాజ్యంగా లేదు. అందుకని వేరు ప్రాంతాల్లో ఉన్నవారు ఒకేవిషయాన్ని వేరు వేరు మాటలలో చెప్తారు. కాబట్టి మరే భాషలో ఉండటానికి వీలులేనన్ని మాటలు తెలుగులో ఉన్నాయి. ఉదాహరణకు వ్యంగ్యం అన్న ఒక్క మాటకు తెలుగులో ఎత్తిపొడుపు, ఎగతాళి, ఎద్దేవా, దెప్పుళ్లు, గేలి, వెటకారం, హేళన, విడంబరం అని పర్యాయార్థాలు ఉన్నాయి. శతకాలు, పద్యాలు కేవలం తెలుగు భాషలోనే ఉన్నాయి.

నేల మీద మొత్తం 6,500దాకా భాషలుంటే అందులో 5 మాత్రమే అజంత భాషలున్నాయి. వాటిలో తెలుగు ఒకటి. 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని అన్నారు శ్రీకృష్ణదేవరాయలు. తెలుగు భాషలోని మాధుర్యం, గొప్పతనం ఇక ఏ భాషలోనూ లేదని చాలా మంది కవులు చెప్పారు. అలాగే వెనీసుకు చెందిన వర్తకుడు నికొలో డా కాంటి భారతదేశం గుండా ప్రయాణిస్తూ, తెలుగు భాషలోని పదములు ఇటాలియన్ భాషవలె అచ్చులు చివరన కలిగి ఉండటం గమనించి తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని కొనియాడారు. దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజల వ్యవహారిక భాష తెలుగు చాలా తీయనిది. తెలుగు వ్యాకరణం చాలా సులభం. సంస్కృతంలో ఉన్న వైభవం తెలుగులో కూడా ఉంది. తెలుగుని 12 కోట్ల తెలుగువాళ్లు ప్రపంచం నలుమూలలా వ్యాపించి ఉన్న కోట్ల మంది తెలుగువాళ్లు మాట్లాడతారు. భారతదేశంలో ప్రాచీన హోదా పొందిన భాషల్లో తెలుగు ఒకటి. నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, శ్రీనాథుడు, తెనాలి రామకృష్ణ కవి, ముక్కునంది తిమ్మన, తిరుపతి వేంకటకవులు, వేమన, బమ్మెర పోతన లాంటి మహామహులు తెలుగులో అనేక రచనలు చేసి జాతి గౌరవాన్ని, భాష స్థాయిని ఆకాశానికి పెంచారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసినవారిలో కృష్ణా నదీ తీర ప్రాంతమైన పెనుగంచిప్రోలులో జన్మించిన ఉద్యమకర్త కొమర్రాజు వెంకట లక్ష్మణరావు, తెలుగులో తొలి కథా రచయిత్రి బండారు అచ్చమాంబ ముఖ్యులు. నిద్రాణమైన తెలుగు జాతిని మేల్కొలిపిన కొమర్రాజు 1876 మే 18న పెనుగంచిప్రోలులో జన్మించిన కొమర్రాజు తెలుగులో మొట్టమొదటి విజ్ఞాన సర్వస్వం రచయిత, విజ్ఞాన మండలి స్థాపకుడు. భువనగిరిలో ప్రాథమిక విద్య అభ్యసించి, నాగపూర్‌లో అక్కా బావలతో ఉంటూ మరాఠీ భాష నేర్చుకున్నాడు. 1900లో బీఏ, 1902 ఎంఏ ఉత్తీర్ణులయ్యారు. మరాఠీ భాషలో వ్యాసాలు, పద్యాలు రాశారు. తెలుగు, మరాఠీ, ఇంగ్లీషు, సంస్కృతం, బెంగాలీ, ఉర్దూ, హిందీ భాషల్లో ప్రావీణ్యం పొందారు. 1901లో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయమైన పుస్తక భాండాగారాన్ని నెలకొల్పిన తొలి తెలుగువ్యక్తి 1906లో విజ్ఞాన చంద్రిక మండలిని, 1910లో విజ్ఞాన చంద్రిక పరిషత్‌ను స్థాపించారు. 1916లో రచించిన 'తెలుగు విజ్ఞాన సర్వస్వం' పుస్తకం దక్షిణ భారతదేశంలో సంచలనం సృష్టించింది. 11 భాషా విషయక పుస్తకాలు, 2 చారిత్రక గ్రంథాలు, ఇతర శాస్త్రాలతో 20 పుస్తకాలు రాశారు. 1923లో ఆరోగ్యం క్షీణించి తిరిగిరాని లోకాలకేగారు. తొలి తెలుగు కథా రచయిత్రి బండారు అచ్చమాంబ. కొమర్రాజు సోదరి అయిన అచ్చమాంబ దేశంలోనే తొలి తెలుగు కథారచయిత్రి. ఆమె అనేక రచనల్లో స్త్రీవిద్య, వితంతు పునర్వివాహం వంటి సాధక విషయాలతో హిందూసుందరి, జనాన అనే పత్రికల్లో వ్యాసాలు రాశారు. 1901లో మహిళా సంఘాన్ని స్థాపించిన తరువాత ఆమె 1902లో అబల సచ్చరిత్రమాల అనే గ్రంథాన్ని వెలువరించింది. 1901 నుంచి 1903 వరకు ధనత్రయోదశి, గుణవతి వంటి 10 కథలు రాశారు. తొలి తెలుగు కథా రచయిత్రిగా గౌరవం అందుకున్నారు. ఆమె కథల్లో భావోద్వేగాలు, స్త్రీవాదాలు, హక్కులు మొదలైన వైవిధ్యభరితాలు ఆనాడే కనపడేవి. 1904లో ఆమె రాసిన 'బీద కుటుంబం' అనే కథ నాటి సామాజిక పరిస్థితులకు నిదర్శనంగా నిలిచింది. స్పష్టమైన అభిప్రాయాలతో రచనలు కొనసాగించి తొలి తెలుగు కథా రచయిత్రిగా సుస్థిర స్థానాన్ని పొందారు.



ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో మాతృభాషలు అంతర్థానమయ్యే స్థితిలో ఉన్నాయి. ప్రపంచంలో ఇప్పటికే సుమారు 230 భాషలు అంతరించాయని, ఇంకా 3 వేల భాషలు అంతరించే దశలో ఉన్నాయని యునెస్కో వెల్లడించింది. ఒక భాషను మాట్లాడే జనాభాలో 30 శాతం మంది ఆ భాషను చదవకుండా, తల్లి భాషకు దూరమైతే ఆ భాష కాలక్రమంలో మృతభాషగా మారుతుందని యునెస్కో సూత్రీకరించి, తెలుగుకు ఆ పరిస్థితి రాబోతుందని ప్రకటించింది. ఇది తెలుగు భాషాభిమానులను కలవరపర్చే విషయం. నలభైకి పైగా భాషలు, మాండలికాలు భారతదేశంలో అంతరించిపోయే స్థితిలో ఉన్నాయి. ఈ భాషలన్నీ ప్రమాద స్థాయిలో ఉన్నాయి. నీతి, నియమాలు, నడవడిక నేర్పే మాతృభాషలు అంతరిస్తే, మానవ మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. సైన్స్, కంప్యూటర్, గణితం.. ఇలా ఏ సబ్జెక్టు కూడా మంచి-చెడుల గురించి చెప్పవు. మంచి, చెడు విడమరిచి చెప్పేది మాతృభాష ఒక్కటే. అలాంటి మాతృభాష అంతర్థానమైతే మన మనుగడే ప్రశ్నార్థకం అవుతుంది.

తెలుగు ఆధునీకరణ జరగాలి. సమకాలీన అవసరాలకు తగ్గట్టుగా మార్పులతో కూడిన సాహిత్యం రావాలి. సమకాలీన జ్ఞానాన్ని మన భాషల్లోకి అనువదించుకోవాలి. ఆ విధంగా భాషని అభివృద్ధి పథంలోకి తీసుకురావాలి. భాష కేవలం భావాలు వ్యక్తం చేయడానికి ఉపయోగపడే సాధనమే కాదు, ఒక జాతి ఉనికిని, సంస్కృతికి భాష మూలాధారం. భాష అంతరించిందంటే ఆ భాష మాట్లాడే సమూహం అంతరించినట్లేనని భావించాలి. నిజమైన భావ ప్రేరేపణ, ప్రగతి, మాతృభాష వల్లనే వస్తుందని, స్వభాషలో విద్య ఉంటే, స్వరాజ్యం ఎప్పుడో వచ్చేదని గాంధీజీ 1938లోనే చెప్పారు. ఇతర భాషల కన్నా మాతృభాషలో నేర్చుకోగల సామర్థ్యం ఎవరికైనా ఎక్కువగా వుంటుందని నిపుణుల మాట. మాతృభాషలో విద్యను బోధిస్తే మానసిక వికాసానికి, సంపూర్ణ మూర్తిమత్వానికి దోహదం చేస్తుంది.

అందుకే మాతృభాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి పరమావధి కావాలి. సుసంపన్నమైన మన భాషా సాహిత్య సౌందర్యాన్ని అవగాహన చేసుకోవడం, మన భాషను, సంస్కృతినీ కాపాడుకోవడం, భావి తరాలవారికి దీన్ని అందించడం ఆ భాషా సౌందర్య సంపదను కాపాడటం మన అందరి కర్తవ్యం. ■

పొద్దున్నే స్కూల్‌కి వెళ్లటం, సాయంత్రం ఇంటికి వచ్చాక ఇరుగు-పొరుగు పిల్లలతో కాసేపు ఆడుకోవడం, ఆపైన హోం వర్క్ చెయ్యటం, ఏమీ తోచనప్పుడు ఏవో కథల పుస్తకాలు చదువుకోవటం, తాతయ్యలు, అమ్మమ్మలు చెప్పే కథలు వినడం.. ఇలా ఒకప్పటి పిల్లల బాల్యపు జీవనశైలి ఒక పద్ధతి ప్రకారం సాగేది.
కానీ ఈ తరం పిల్లల జీవన విధానం అలా లేదు. చదువుతో పాటు అదనపు వ్యాపకాలు, కళలు అభ్యసించడానికి



# చిత్ర కెరటం

అంతర్జాలం అందుబాటులోకి వచ్చింది. అరచేతిలో ఉన్న సెల్ ఫోన్‌లో ఏ అంశానికి చెందిన సమాచారమైనా క్షణాల్లో కళ్ల ముందు ప్రత్యక్షమవుతోంది. అంతర్జాలాన్ని నేటి యువతరం అద్భుతంగా ఉపయోగించుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏకంగా ఓ అమ్మాయి యూట్యూబ్ కోచింగ్ ద్వారా మెడికల్ కాలేజీలో సీట్ సాధించింది.
అనేకమంది పిల్లలు అనేక రకాల కళలలో అంతర్జాల శిక్షణ ద్వారా రాణిస్తున్నారు. ఎంచుకున్న విభాగం ఏదైనా కావచ్చు.. సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం, నాట్యం.. వంటి అనేక కళలలో ఎన్నో విధాలుగా అభివృద్ధి చెందుతున్నారు. ప్రావీణ్యం సంపాదిస్తున్నారు. అగ్రస్థానాలకు దూసుకెళ్తున్నారు.
రంగుల్లో ముంచిన కుంచెతో కాన్వాస్ మీద చిత్రాన్ని ఊహిస్తూనో, వ్యక్తిని చూస్తూనో బొమ్మ గీయటం ఈ మధ్య చాలా మందికి తెలుసు. కానీ పెన్సిల్‌తో హైపర్ రియలిస్టిక్ టెక్నిక్ ద్వారా అత్యంత సహజంగా గీస్తున్న చిత్రాలు అబ్బురపరుస్తున్నాయి.
ఆంధ్రప్రదేశ్, పశ్చిమ గోదావరి జిల్లా, తణుకు మండలం, వేల్పూరు గ్రామానికి చెందిన పాతికేళ్ల యువకుడు సతీష్ కుప్పాల. ఇతనిలో సహజసిద్ధంగా చిత్రకారుడు ఉన్నాడు. పెన్సిల్ ఆర్ట్‌లో హైపర్ రియలిస్టిక్ డ్రాయింగ్‌లో ప్రావీణ్యత సాధిస్తున్న వర్ధమాన చిత్రకారుడు.

### హైపర్ రియలిస్టిక్ డ్రాయింట్ అంటే ఏమిటి?

ఒక వ్యక్తి ముఖ కవళికలలో స్కిన్ పోర్స్, కంటికి కనిపించని కేశాలను సైతం అత్యంత సహజంగా ఆ వ్యక్తిని దగ్గరగా చూస్తున్న అనుభూతిని పెన్సిల్ ఆర్ట్ ద్వారా చిత్రించటం. ఈ టెక్నిక్‌లో ఒక చిత్రాన్ని గీయటానికి సుమారు 100 నుండి 150 గంటల సమయం పడుతుంది.
సతీష్ బాల్యంలో ఎవరైనా ఆర్టిస్టులు గోడల మీద రాస్తున్నప్పుడు, చిత్రాలు వేస్తున్నప్పుడు ఆటలు కూడా ఆడుకోకుండా ఎంతో ఆసక్తిగా గమనించేవాడు. ఆ తపనతోనే పత్రికల్లో వచ్చే కార్టూన్లు, పలు రకాల పువ్వులను, బొమ్మలను తనదైన శైలిలో బొమ్మలు గీసేవాడు. మెగా స్టార్ చిరంజీవికి వీరాభిమాని అయిన సతీష్ ఆయన నటించిన 'జై చిరంజీవ' సినిమా విడుదల అయినప్పుడు వాళ్ల ఊళ్లో ఫ్రెండ్స్‌తో కలిసి ఆ చిత్రం తాలూకు బ్యానర్ పెట్టించాలని నిర్ణయించుకున్నాడు. వాళ్ల ఊళ్లోనే ఉన్న యు.ఎస్.ఆర్ట్స్ తాలూకు ఆర్టిస్ట్ ఉండవల్లి శ్రీను దగ్గరకు వెళ్లాడు. అక్కడ శ్రీను గీస్తున్న చిత్రాలు



చూసి, తనకు ఆర్ట్ మీద ఉన్న ఆసక్తిని గురించి అతనికి చెప్పాడు. ఆ తర్వాత సతీష్‌లో ఉన్న తపనను గుర్తించి, చిత్రకళ నేర్పడానికి అంగీకరించాడు ఉండవల్లి శ్రీను.
ప్రతిరోజు స్కూలు ముగిసిన తర్వాత శ్రీను దగ్గర శిక్షణ పొందసాగాడు. మొదటిసారి ఒక ప్రొఫెషనల్ ఆర్టిస్ట్ దగ్గర డ్రాయింగ్ నేర్చుకుంటూ, బొమ్మలకు అవుట్‌లైన్ గీయటం, రంగులు అద్దటం నేర్చుకున్నాడు. కొన్నాళ్ల విరామం తర్వాత సూపర్‌షైన్ అనే ఆర్టిస్ట్ దగ్గర సంవత్సరం పాటు శిక్షణ పొందాడు. చదువులో బిజీ అయ్యాడు. బీ.కాం. పూర్తి చేశాడు. అయినా చిత్రకళ మీదున్న ఆసక్తితో ఖాళీ చిక్కినప్పుడల్లా బొమ్మలు వేస్తుండేవాడు.



సతీష్‌వాళ్ల కుటుంబంలో తాత ముత్తాతల నుండి మిఠాయి వ్యాపారం చేస్తున్నారు. తమ ఊళ్లోనే మిఠాయిషాపు నడుపుతున్నారు. అన్నయ్యలకు వ్యాపారంలో సహకరిస్తూనే, మరోపక్క చిత్రకళలో సాధన చేస్తున్నాడు.

కరోనా సమయంలో ఏర్పడ్డ లాక్‌డౌన్ విరామ సమయాన్ని వృథా చేసుకోకుండా, తన ప్రతిభకు పదును పెట్టడంలో భాగంగా ఆన్‌లైన్‌లో లండన్‌లో ఉంటున్న కెల్విన్ ఒక ఒకాఫర్ అనే ఆర్టిస్టు గురించి తెలుసుకొని, ఆయన దగ్గర హైపర్ రియలిస్టిక్ పెన్సిల్ డ్రాయింగ్‌లో శిక్షణ పొందాడు. మెళకువలు తెలుసుకున్నాడు.

పెన్సిల్ ఆర్ట్‌లో సతీష్ గీస్తున్న చిత్రాలు ఎంతో సహజంగా, ఎంతో వైవిధ్యంతో ఆకట్టుకుంటున్నాయి. ఇదే కాకుండా బాల్‌పెన్ డ్రాయింగ్స్, ఏక్రలిక్, ఆయిల్ పెయింటింగ్స్ తోనూ రంగుల చిత్రాలు గీస్తున్నాడు సతీష్.

చిత్రకారుడుగా ఎంతో మందిని ఆకర్షిస్తున్న ఈ యువ కెరటం జాతీయ స్థాయిలో ఆర్ట్ ఎగ్జిబిషన్లలో తన చిత్రాలు ప్రదర్శింపబడాలని ఆకాంక్షిస్తున్నాడు. ఇటీవల విజయవాడలో జరిగిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో తన చిత్రాలు ప్రదర్శించి పలువురి మన్ననలు పొందాడు.

"ఎంత నేర్చుకున్నా ఎప్పటికప్పుడు నేర్చుకోవాల్సిన విషయాలు ఎన్నో ఉంటూనే ఉంటాయి. కళ అనంతం. నిరంతర విద్యార్థిలా చిత్రకళని అభ్యసిస్తూ, ప్రజామోదం పొందే చిత్రాలను గీస్తూ, దేశ విదేశాల్లో తన చిత్రాలు ప్రదర్శించబడాలని కృషి చేస్తున్నాను" అంటున్నాడు సతీష్. హైపర్ రియలిస్టిక్ డ్రాయింగ్స్‌లో సతీష్ గీసిన చిత్రాల్లో కీ.శే.ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ప్రసిద్ధ దర్శకులు రాజమౌళి, ప్రఖ్యాత నటి సాయిపల్లవిల చిత్రాలుఅత్యంత సహజంగా, దెరుగా వాళ్లని చూసిన అనుభూతిని కలిగిస్తున్నాడు ఈ యువ చిత్ర కళా మాంత్రికుడు సతీష్.

"నేర్చుకోవాలనే పట్టుదల, ఆసక్తి ఉండి తన దగ్గరకు వచ్చేవారిని, తనను సంప్రదించేవారికి పెన్సిల్ ఆర్ట్‌లో మెళకువలు చెబుతూ చిత్రకల నేర్పిస్తానని" అంటున్నాడు సతీష్.

ప్రోత్సాహం ఉన్నప్పుడే ఏ కళ అయినా రాణిస్తుంది. మారుమూల గ్రామంలో ఉన్న ఈ యువ చిత్ర కళాకారుడికి తగినంత చేయూత, ప్రోత్సాహం అందించాలని అలాగే అతని చిత్రాలు దేశ విదేశాల్లో ఆర్ట్ గ్యాలరీల్లో ప్రదర్శన కావాలని, అతను తన చిత్రకళ ద్వారా ఎంతో మందికి స్ఫూర్తిని ఇవ్వాలి, దేశం గుర్తించే చిత్రకారుడుగా గుర్తింపు పొందాలని అభినందనలు తెలియజేద్దాం.

**- ఎం.వెంకటేశ్వరరావు**

---

# పండ్ల పొడులు




పనస పిండి.. అనాస పిండి

ఇప్పుడు మార్కెట్లో రక రకాల పండ్లతో చేసిన పిండి లభిస్తోంది. పనసపిండి, అరటిపిండి లాంటి పండ్లతో చేసిన పిండి మార్కెట్లో అమ్ముతున్నారు. వీటిని గోధుమ పిండిలాంటి వాటితో కలిపి వాడటం అదనపు పోషకాలు లభించడంతో పాటు రుచీ పెరుగుతుంది.

పనస పిండి

దీనిని చపాతీపిండిలోకి, కూరల్లోకి, సూపుల్లోకి వేసుకోవచ్చు. పీచుతో పాటు ప్రొటీన్‌ని సమృద్ధిగా అందిస్తుంది.

## నేరేడు పిండి

నేరేడు పిండిలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఈ రంగు కావాలనుకునేవారు దీనిని స్వీట్లలోనూ ఉపయోగించవచ్చు.

ఖర్జూరం

వంటల్లో పంచదార వాడకుండా ప్రత్యామ్నాయంగా ఈ పిండిని వాడుకోవచ్చు. స్వీట్ల తయారీలో, బేకింగ్‌లో ఉపయోగిస్తారు.

**అనాసపిండి**

కేకులు, పుడ్డింగులు, మిఠాయిల తయారీలో ఈ పిండిని వాడుకోవచ్చు. రుచి చాలా బాగుంటుంది.

దానిమ్మ

కూరలకి పుల్లటి రుచి కావాలనుకున్నపుడు, చాట్‌మసాలాకి ప్రత్యామ్నాయంగా వాడుకోవచ్చు. బేకింగ్, సూప్‌లకు మంచి రుచి ఇవ్వడానికి ఇది ఉపయోగపడుతుంది.

ఆరెంజ్, స్ట్రాబెర్రీ, మామిడి పొడులను సైతం రుచికోసం బేకింగ్‌లో వాడుతుంటారు.



# కొన్ని పరిమళాలు



నలుగురితో మాట్లాడుకోవటం
పక్షుల కిలకిల రావాలు వినటం
వనాలు పచ్చని తోరణాలు కట్టటం
మొగ్గలు వీడి గాలితో పలకరించటం
గాలి చేరి హృదయాలు వికసించటం
ఇసుకతిన్నెల్లో కూర్చుని
ఎగసే కెరటాల్ని చూడటం
చుట్టూ ఊగే దృశ్యాల్ని
కళ్లల్లో వొంపుకోవటం
ఆస్వాదించటం
నాలో సంచరించే కొన్ని పరిమళాలు.
వెన్నెల కాంతుల్ని తొడుక్కోవటం
వర్షధారల్ని నింపుకోవటం
ఆశగా/ ఆకాశం వంకా
హరివిల్లు వంకా
కొంచెం కొత్తగా చూపుల్ని ఆరేసుకోవటం
నాకింకా అలానే
ఆనందాలు పొద్దు పొడుస్తున్నాయి.
దేహమంతా పరవశంతో
అనేక దీపాలుగా వెలుగుతుంది.
చిన్ని కొండలనూ ఎక్కి
దృశ్యాల్ని నింపుకుంటాను.
పిల్లకాల్వల్లో/ చేపలు పట్టుకుంటాను
కొన్ని పరిమళాల్ని/ నాతో అంటిపెట్టుకుంటాను.

**- గవిడి శ్రీనివాస్**

---

# జారిపోతున్నంతసేపు..

జారిపోతున్నంతసేపు / నీకు వింతగాను, కొత్తగాను
అనిపిస్తుంటుంది.
అది కాలమైనా.. హృదయమైనా
రోజులు గడుస్తున్నకొద్దీ
మరీ పాతబడిపోతుందిగా కాలం.
అందుకే నీకందకుండా
జారిపోతుంటుంది.
దానిని పట్టుకునే
ప్రయత్నం



ముట్టుకునే సాహసం
చేయలేవు నువ్వు.
హృదయం కూడా
అంతే!
అది నీతో ఉన్నా
నీలో ఉన్నా
పట్టుకోలేవు..
ముట్టుకోలేవు.



అది కాలం వెంట ప్రయాణించే
ఒక యంత్రం.
నీకు కనబడకుండానే అది
నిన్ను ఆడిస్తూ ఉంటుంది.
నిన్ను ఓడిస్తూ, గెలిపిస్తూ
కాసేపు నవ్విస్తూ
మరికాసేపు ఏడిపిస్తూ ఉంటుంది.
ఆగకుండా సాగుతూనే ఉంటుంది
కాలంలాగే..
ఒక్కసారి అకస్మాత్తుగా
అది ఆగిపోయి నిన్నూ
ఆపేస్తుంది.
రెండూ నిన్ను వెంటాడేవే..
నిన్ను అంటుకుని తిరిగేవే.
జారిపోనంతసేపు/ అవి నీకు అనుకూల ధ్రువాలు
జారిపోతున్నంతసేపు
అవి నీకు సంభ్రమాశ్చర్యాలు
జారిపోయాక../ అవి నీకు ప్రతికూల దృశ్యాలు..
మరి.. ఇప్పుడైతే/ సంభ్రమాశ్చర్యాల మధ్య
ఊగిసలాడుతున్నాం.

ఈ వారం కవిత్వం

**- డా॥ తిరునగరి శరత్ చంద్ర**

## కవిశేఖర 'గరికపాటి' వారి కావ్యకుసుమ సంపుటి



కవిశేఖర గరికపాటి మల్లావధాని సనాతన సంప్రదాయ జీవన విధానాన్ని స్వీకరించిన, ఆధునిక భావాలను పద్యకృతులుగా రచించిన పండితవరేణ్యులు. జాతీయోద్యమంలో పాల్గొని, జైలుశిక్షలు అనుభవించిన స్వాతంత్ర్య సమరయోధుడు. వైజయంతి కావ్యకుసుమ సంపుటిలో 'శంకరావతరణ' కృతితో సంపుటం ప్రారంభింపబడి, హేలాపుర (ఏలూరు) వేంకటేశ్వరస్తవంతో పూర్తి అవుతుంది. గరికపాటి శివరామకృష్ణ పితృఋణం తీర్చుకొనే సత్సంకల్పంతో ఉభయభాషలలో ప్రవీణులైన కవితా దురంధరులు గరకపాటి మల్లావధాని రచనా సంపుటిగా వైజయంతి కావ్యాన్ని ముద్రింపచేసారు. ప్రభోదష్టకమ్ సంస్కృత శ్లోకాలు, ప్రథమ ద్వితీయ ఆశ్వాసాలుగా శంకరావతరణం, పితృ, మాతృస్తుతి, శివనివేదనం, అరిషడ్వర్గం, ఋతుషట్కం, పుష్పవివేకం, అమరుకావ్యం వైజయంతి గ్రంథ ప్రథమభాగంలో వున్నాయి. రెండవ భాగంలో భారతాంబికా శతకం, విద్యార్థి శతకపద్యాలు, మహాత్ముని ప్రశంస, నిర్యాణ సందర్భంలో అశ్రుతర్పణం, భారత ప్రజాప్రభుత్వ పంచమ మహోదయం, ఆంధ్రమాతృస్తవం, ఆంధ్రుడు, ప్రబోధం, రాష్ట్రావతరణం, స్వాతంత్ర్యోత్సవం, పంచాయితీ రజతోత్సవం, కార్మిక సోదరుడు దండకం, నా చిన్ననాటి రెడ్డిసీమ, నా తెలుగు భాష అత్యవసర పరిస్థితి, సోదరలేఖ, వివిధ సందర్భాలలో కవి మల్లావధాని, పద్యకవితా మాధుర్యం వైజయంతి గ్రంథంలో వున్నాయి.

**(వైజయంతి, రచన: గరికపాటి మల్లావధాని, వెల: రూ 200, ప్రతులకు: 416, శ్రీకృపా అపార్ట్‌మెంట్స్, శృంగేరి కాలనీ, కొత్తపేట, హైదరాబాద్)** **- యర్రమిల్లి**

## అందంగా అల్లబడిన అనుభూతి కథలు



రచయిత్రి షామిర్ జానకీదేవి విశ్రాంత బ్యాంకు ఉద్యోగిని. ఒక వ్యక్తిగా, గృహిణిగా, మాతృమూర్తిగా మీదు మిక్కిలి ఉద్యోగినిగా అపారమైన అనుభవం గడించారు. తన అనుభవాల సంపదలోంచి ఆసక్తికరమైన సంఘటనలను కథలుగా మలిచి ఈ సంపుటిగా అందిస్తున్నారు. వంశీ ఆర్ట్స్ థియేటర్స్ అధ్యక్షురాలు తెన్నేటి సుధాదేవి అన్నట్లు 'సంపుటిలో ఇవ్వబడిన 30 కథలు వాస్తవ కథాచిత్రాలు' రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మి అన్నట్లు 'జీవితానుభవాలు'. కరోనా విపత్తులో తీరక సమయాల్లో రాశారు కాబోలు మూడవవంతు కరోనా అది సృష్టించిన బీభత్సం అది విజృంభించి ఉన్నంత సేపూ, బ్యాంకులో, ఇంట్లో, అపార్టుమెంటు కాంప్లెక్సులో తోటివారితో పని వారితో ఎలా మెలిగింది. ఏజాగ్రత్తలు, నిబంధనలు, ఎలా పాటించిందీ వివరించారు. మరో పదికథలు బ్యాంకులో సహోద్యోగుల తీరుతెన్నులు కష్టమర్లు. పైఅధికారులు క్రింది అధికారులు ఎలా మసలింది. వారితో కథకులు ఎలా నెగ్గుకు వచ్చిందీ వివరించారు. కథలన్నింటా ఒకటి అరా సంఘటనల వివరణ కనుక క్లుప్తంగా 2 లేక 3 పేజీల్లో ముగించబడ్డాయి. పాతరోజుల్లో పనివాళ్లకు అప్పుల రూపంలో ఇచ్చి..అప్పుకింద బానిసలుగా పని చేయించేవారు. ఇప్పుడు కథ రివర్స్ మనం డబ్బులిచ్చి వాళ్లకు లొంగిపోతున్నామా? (పే:34) కొన్ని సమస్యలకు పరిష్కారం అనుభవిస్తేనే దొరుకుతుంది. (పే:32)లాంటి కథ చివరివాక్యాలు ఆకట్టుకుంటాయి. **(కంచి గరుడసేవ కథలు, రచన: షామిర్‌జానకీదేవి, వెల: రూ 100, అచ్చంగా తెలుగు, ప్రతులకు: నవోదయబుక్‌హౌస్) - కూర చిదంబరం**

## పుస్తక సమీక్ష


## డ్రైవర్‌బాబు డాక్టరయ్యాడు



పొత్తూరి సుబ్బారావుకు అంకితంగా పొట్టిశ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం వారి ఆర్థిక సహకారంతో ప్రచురణైన ఈ కథాసంపుటిలో 14 కథలున్నాయి. ప్రముఖకథా రచయిత, విమర్శకులు విహారి, కవి, రచయిత పెద్దూరి వెంకటదాసు, ఈ కథాసంపుటికి విలువైన చక్కటి ముందుమాటలు రాసారు. కవయిత్రి గతంలో 'నిశ్శబ్ద జలపాతాలు' అనే కథాసంపుటి తీసుకొచ్చారు. వైవిధ్యంతో, బలమైన వస్తు శిల్ప ప్రాధాన్యతలకు సమతూకం ఇస్తూ మానవీయ సంబంధాలు, కుటుంబచ్ఛాయలు, పదునైన సంభాషణలతో గల సన్నివేశచిత్రణ, చివరిపేజీ దాకా పాఠకుణ్ణి చదివించే అక్షర రమ్యతగల ఓ విభిన్నమైన ప్రత్యేకశైలితో ఈ కథలున్నాయి. 'డెత్ సర్టిఫికెట్' ద్వారా ఆస్తి డబ్బు కొట్టేయాలని చూసే దత్తపుత్రుని నిర్వాకం పోలీసులకు చిక్కడంతో కథ ముగుస్తుంది. మానవ సంబంధాలన్ని ఆర్థిక సంబంధాలన్నాడు మార్క్స్. కరోనాకాలంలో 'లాక్‌డౌన్' వల్ల ఎందరో ఇబ్బందులు, బాధలు, కష్టాలు, వీధిన పడిన సంసారాలు వేలమైళ్ల కాలినడకన వలస కూలీల బ్రతుకు ప్రయాణం మనసున్న వారిని కలచివేస్తాయి. 'ఎంసెట్' రాయాల్సిన విద్యార్థి అతని తల్లిదండ్రుల మానసిక వ్యధను 'లాక్‌డౌన్' కథలో అద్భుతంగా అక్షరీకరించారు రచయిత్రి.సమాజమార్పున కోరేవిధంగా కథలు రాసిన జయలక్ష్మి అభినందనీయులు. **(డ్రైవర్‌బాబు డాక్టరయ్యాడు, రచన: పొత్తూరి జయలక్ష్మి, వెల: రూ 100, ప్రతులకు: సాహితీకిరణం, ఇ.నం.11-13-154, అల్కాపురి, హైదరాబాద్)** **- తంగిరాల చక్రవర్తి**

## పచ్చని భావాలు, ఆలోచనలు సంచిక 'హరితనానీలు'

ఏభయి సంవత్సరాలుగా వ్యవసాయ క్షేత్రంలో హరిత సంపదను ఆస్వాదిస్తున్న రైతుబిడ్డ బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి యిప్పుడు తాజాగా సాహిత్యక్షేత్రంలో అడుగిడి శతాధిక నానీల పంటతో మన ముందుకొచ్చాడు. ఆయన తొలి



ప్రయత్నఫలం 'హరితనానీలు' సంపుటి. రైతు కేంద్రంగా చేసుకుని రాసిన కొన్ని నానీలతో బాటు యితర సామాజికాంశాలను స్పృశించిన లఘు కవితల్ని ఆస్వాదించవచ్చు. 'పసిడి చేనుకు తెల్లనిగట్టు/ బారులు తీరిన కొంగలు!' Necklace Road గుర్తుకొస్తోంది కదూ! 'నాన్నంటే నాకెంతో ఇష్టం/ అమ్మతనం కూడా ఆయన గుండెనుండా' నాన్నతో అమ్మను కూడా దర్శించడం గొప్ప ఊహ. 'బాదుగెద్దూ అదిలించే రైతూ/ ఇకపైన అపురూప వస్తువులే' 'వ్యవసాయమూ జూదమే/ పంట దక్కేదీ లేనిదీ చివరిదాకా తెలియదు' 'పొలం నాకు అమ్మ/ ప్లాటు ప్లాటుగా విడగొడుతుంటే/ కన్నీటి చెమ్మ'. గిట్టుబాటు కాని వ్యవసాయవృత్తి క్రమక్రమంగా కనుమరుగవుతోందని కవి ఆవేదన. 'ప్రతి ఉదయం నవోదయం/ మంచి ఆలోచనతోనే శుభోదయం' అంటూ పచ్చని ఆలోచనలు, భావాలు పంచిన 'హరితనానీలు' యివి.

**(హరితనానీలు, రచన: బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి, వెల: రూ 60, ప్రతులకు: బి.రామిరెడ్డి, వేణుగోపాలస్వామి దేవాలయం ఎదురు, మంగళగిరి, గుంటూరు జిల్లా)**

**- రమణ వెలమకన్ని**

# దయగల దైవం ధభళేశ్వరుడు



**ఉత్కళ దేశం జగన్నాథ భూమిగా ప్రసిద్ధి. ఒరియా ప్రజల ఆరాధ్య దైవం శ్రీ జగన్నాథుడు. వారి తల్లి, తండ్రి, దైవం, గురువు అన్నీ ఆయనే! వారి విశ్వాసానికి తగినట్లుగానే జగన్నాథుడు సోదర సోదరీ సమేతుడై తన ప్రజల గృహాల వద్దకు రథారూఢుడై తరలివెళతారు. ప్రతిరోజూ తనకు నివేదించే భోజనాన్ని తనవారందరికీ మహా ప్రసాదం కింద అందచేస్తారు.**

కానీ విచిత్రమైన విషయం ఏమిటంటే రాష్ట్రంలో అధికంగా ఆదిదంపతులైన శ్రీ దుర్గామహేశ్వరుల ఆలయాలు కనపించటం.

యాభై ఒకటి శక్తిపీఠాలు భారతదేశంతో పాటు పక్కన ఉన్న దేశాలలో ఉన్నాయన్నది పురాణాలు తెలుపుతున్న విషయం. వీటిల్లో పద్దెనిమిది 'అష్టాదశ శక్తి పీఠాలు'గా ప్రసిద్ధి. అవి కాకుండా మరో నాలుగు 'మహా' లేక 'ఆదిశక్తి పీఠాలు' కూడా ఉన్నాయంటారు. వాటిలో రెండు, అష్టాదశ పీఠాలలో ఒకటి ఒడిశాలో ఉండటం చెప్పుకోవలసి విషయం.

ఇక కైలాసనాథునికి అనేక ప్రసిద్ధి ఆలయాలు ఈ రాష్ట్రంలో ఉన్నాయి. ఇవన్నీ

ఆలయ దర్శనం

పురాణ, చారిత్రక నేపథ్యం కలిగి ఉండటం విశేషం. అలాంటి వాటిలో ఒకటి శ్రీ ధభళేశ్వర మహాదేవ మందిరం.

కటక్ ఉత్కళ దేశ ఒకప్పటి రాజధాని. కథజొరీ, మహానదుల మధ్య నెలకొని ఉన్న ద్వీపాన్ని గతంలో 'కటకం' అని పిలిచేవారు. మన దేశంలోని పురాతన నగరాలలో ఒకటిగా పేరొందిన కటక్ పట్టణానికి సమీపంలో మహానది మధ్యలో ఏర్పడిన చిన్న ద్వీపంలో ఉంటుంది శ్రీ ధభళేశ్వర మహాదేవ మందిరం.

ఆలయ గాథ

కొన్ని శతాబ్దాల క్రితం ఈ ప్రాంతంలో పశువుల దొంగలు ఎక్కువగా ఉండేవారట. వారి బారి నుండి తమ పశువులను కాపాడుకోవడానికి ప్రజలు చాలా అప్రమత్తులై ఉండేవారు. దొరికిన చోరులను కఠినంగా శిక్షంచేవారట. అలాంటి సమయంలో భార్యాబిడ్డలను పోషించడానికి తప్పనిసరై దొంగతనానికి బయలుదేరాడు ఒక చోరుడు. అతను నిత్యం శివపూజ చేసేవాడు. అతికష్టం మీద ఒక నల్ల కొయ్యదూడను దొంగిలించగలిగాడు. దానిని రహస్యంగా తీసుకొని వెళుతున్న సమయంలో కాపలాదారుల కంట పడ్డాడు. ఇక వేరే దారి లేక ఆలయంలోకి వెళ్లి గర్భాలయంలో దాక్కున్నాడు. కాపలాదారు ఆలయంచుట్టూ ఉండి దొంగ బయటికి వస్తే పట్టుకొని శిక్షిద్దామని ఎదురు చూస్తుండిపోయారట. పరిస్థితి అర్థమైన చోరుడు "తనను కాపాడితే ఇకపైన దొంగతనాలు చేయకుండా కష్టపడి జీవితాన్ని గడుపుతానని" మొర పెట్టుకొని, ఆయన పాదాలను వదలని ప్రమాణం చేసాడట. అదే సమయానికి వెలుపల కాపలాదారుల వద్దకు ఒక సాధువు వచ్చారట. వారిని విషయం అడిగి తెలుసుకుని "లోపల ఉన్నది దొంగ కాదని, అతని దగ్గర ఉన్నది నల్ల కొయ్యదూడ కాదన్నారట". దాంతో ఆగ్రహించిన కాపలాదారు "అదే నిజమైతే అతనిని విడిచిపెడతాం" అన్నారు. సాధువు లోపలికి వెళ్లి దొంగను దూడతో పాటు వెలుపలికి తీసుకొని వచ్చారు. ఆయన చెప్పినట్లుగా అది తెల్లటి కొయ్యదూడ.

అందరూ ఆశ్చర్యపోయి చూస్తుండగానే సాధువు మాయమైపోయారని కథనం. దొంగతో సహ అందరికీ అర్థమైంది ఆయన సర్వేశ్వరుడని. ఆ రోజు నుండి నల్ల కొయ్యదూడను తెల్లగా మార్చిన స్వామిని శ్రీధభళేశ్వర మహాదేవుడు అని పిలవసాగారు. ప్రమాణం చేసిన ప్రకారం దొంగ దొంగతనాలు మానేసాడు.

ఈ గాథకు ప్రమాణంగా ఒక గర్భాలయ ద్వారానికి రెండు పక్కలా తెల్ల నందులను ఉంచారు.

ఆలయ విశేషాలు

మహా నదిలో సహజంగా ఏర్పడిన ద్వీపం "ధభళేశ్వర్". ధభళేశ్వరుడు కొలువైనందున అదే పేరుతో పిలుస్తున్నారు.

చోరునికి సంబంధించిన ఈ సంఘటన తొమ్మిదో శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని పాలించిన సోమవంశీల కాలంలో జరిగిందని శాసనాలు చెబుతున్నాయి. నాటి పాలకుడైన "యయతీ కేసరీ వర్మ" ఆలయాన్ని నిర్మించినట్లుగా తెలుస్తోంది. కాలక్రమంలో వివిధ రాజవంశాలవారు చేసిన మార్పులు, అభివృద్ధి కారణంగా ప్రస్తుత రూపంలో దర్శనమిస్తుంది దేవాలయం. ఉపాలయాల్లో శ్రీ గణపతి, శ్రీ హనుమంతుడు, శ్రీ భద్రకాళి ఉపాలయాల్లో దర్శనమిస్తారు. శ్రీ పార్వతీదేవి విడిగా కొలువుతీరి ఉంటారు.

గర్భాలయంలో శ్రీ ధభళేశ్వర మహాదేవుడు స్వయంభూ లింగ రూపంలో దరశనమిస్తారు.

ఆలయ ఆకర్షణలు

సుందర ఆహ్లాదకరమైన పరిసరాలు, నిరంతరం ప్రవహించే జీవనది, స్వచ్ఛమైన చల్లని గాలి మనస్సులను మురిపిస్తాయి.

తెలయానికి ఒండు దశాబ్దాల క్రితం పడవలలో చేరుకోవలసి వచ్చేది. తరువాత వేలాడే తీగల వంతెన నిర్మించారు. దాని మీద నడుచుకుంటూ ఆలయాన్ని చేరుకోవడం ఒక చక్కని అనుభూతి.

ప్రతిరోజూ ఉదయం ఆరు గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు; తిరిగి సాయంత్రం మూడు గంటల నుంచి రాత్రి ఎనిమిది వరకు తెరచి ఉండే ఆలయంలో దేవతామూర్తులకు అనేక రకాల అభిషేకాలు, అలంకరణలు, ఆరగింపులు, విశేష పూజలు చేస్తారు.

ప్రతిరోజూ వందలాది మంది భక్తులు వస్తుంటారు. కార్తిక, శ్రావణ మాసాలలో వేలాదిగా భక్తులు విచ్చేస్తారు. సోమవారాలలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. పౌర్ణమి రోజులలో విశేష పూజలు జరుపుతారు. పుష్య పూర్ణిమ, దోల పూర్ణిమ.. ఇలా ప్రతి నిండు పున్నమి రోజులలో ప్రత్యేకమైన అలంకరణ, పూజలు నిర్వహిస్తారు.



కార్తిక, శ్రావణ పౌర్ణమినాడు, శివరాత్రికి పెద్ద ఉత్సవాలు ఘనంగా ఏర్పాటు చేస్తారు. రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు తరలి వస్తుంటారు.


ఒడిశా రాష్ట్రంలోని అనేక శివాలయాలలో శ్రీ ధభళేశ్వర మహాదేవుడు కొలువు తీరిన ఈ క్షేత్రం ప్రత్యేకమైంద.




ఎలా చేరుకోవాలి?

దేశం నలు మూలల నుండి కటక్‌కు రైలుమార్గం ద్వారా చేరుకోవచ్చు. కటక్ నుండి ప్రైవేటు వాహనాల ద్వారా ఈ క్షేత్రానికి చేరుకోవచ్చు. అదే విధంగా కటక్, మరికొన్ని తీర ప్రాంత గ్రామాల నుండి నీటి మార్గంలో కూడా ఇక్కడికి చేరుకోవచ్చు. కటక్‌లో వసతి సౌకర్యాలు లభిస్తాయి.

**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**










కథ

# నా దారి..రహదారి

మంచి వర్తక కేంద్రంగా కార్వేటినగరం అభివృద్ధి చెందసాగింది. గ్రామీణ ప్రజలు తమ వస్తు విక్రయాల కోసం నగరానికి వచ్చి వ్యాపారం చేసేవారు. పొరుగు రాజ్యాలవారు సైతం వ్యాపార నిమిత్తం తరచుగా వచ్చి వెళ్లేవారు. రోజు రోజుకీ నగరం ఆర్థికంగా అభివృద్ధి చెందసాగింది. నగరం విస్తరించేకొద్దీ కొందరు వీధులను కొంచెం.. కొంచెం ఆక్రమించుకోవడం మొదలు పెట్టారు. సరైన నిర్వహణ లేక వీధులన్నీ చెత్తా చెదారాలతో నిండిపోయి, దుర్గంధం వ్యాపించ సాగింది. నగరానికి వచ్చిపోయే ప్రజలు ఇబ్బంది పడసాగారు.

ఆక్రమణలవల్ల ప్రధాన వీధులన్నీ ఇరుకు అయ్యాయి, అనేక దారులు మూసుకుపోయాయి. దీంతో దూర ప్రయాణికులు చుట్టి రావలసి వచ్చేది. చుట్టి రావడం శ్రమ, ఖర్చులతో కూడినందువల్ల గ్రామస్తులకు గిట్టుబాటు కాక నగరానికి రావడం మానుకున్నారు. పొరుగు రాజ్యాల వ్యాపారులు కూడా చిన్నగా తమ వ్యాపారాల కోసం వేరే రాజ్యాల వైపు వెళ్లసాగారు. క్రమంగా నగరంలో వ్యాపార అభివృద్ధి కుంటుపడింది. ఇదిలా ఉండగా.. ఆక్రమణదారులు రాజావారి వీధిని కూడా ఆక్రమించడంతో రాజుకు కోపం వచ్చింది. ఆక్రమింపబడ్డ వీధులను చూసి రాజు బాధపడ్డాడు. వీధులను వెడల్పు చేయించాలని నిర్ణయం తీసుకున్నాడు. వెంటనే వీధులన్నీ విశాలం చేసి, చిన్న చిన్న మరమ్మత్తులు చేసి శుభ్రంగా ఉంచాలని సేవకులకు ఆజ్ఞాపించాడు.

నాలుగు రోజుల తరువాత “పనులు ఎలా జరుగుతున్నాయో చూసి వద్దామని” వెళ్లాడు. అక్కడ కొన్ని కూల్చివేతలు జరుగుతున్నాయి. అందులో భాగంగా వీధి మొదట్లో ఉన్న రాజావారి వీధి శిలాఫలకం విరిగి ఉంది. రాజు చాలా భావోద్వేగానికి గురయ్యాడు. కొద్దిసేపటికి తేరుకుని “ఎందుకు బాధకు గురి అవుతున్నానా?” అని ఆలోచనలో పడ్డాడు. తన పేరిట ఉన్న సూచిక విరగడం తన మనసుకు నొప్పి పుట్టిస్తున్నట్లుగా గుర్తించాడు. ప్రతి మనిషికి తనకు మించినది ఏదీ ముఖ్యం కాదని అర్థమైంది. మదిలో మెరుపు లాంటి ఆలోచన తళుక్కున మెరిసింది.

వెంటనే నగరంలోని సంపన్నులందరినీ సమావేశపరిచాడు. నగరంలోని వీధులకు వారి పేర్లు పెడుతున్నట్లు ప్రకటించాడు. ఇకపై వీధుల నిర్వహణ బాధ్యత మీదేనన్నాడు. వారికి సహాయంగా సైనిక సిబ్బందిని ఏర్పాటు చేశాడు. వారి పేర్లతో అందమైన శిలా ఫలకాలు తయారు చేయించాడు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ, మేళతాళాలతో సంపన్నుల కుటుంబ సభ్యుల చేత శిలాఫలకాలకు ప్రారంభోత్సవం చేయించాడు. వారి పిల్లల చేత వీధులకు ఇరు వైపులా మొక్కలు నాటించాడు. సమయం దొరికినప్పుడల్లా వారిని వీధుల్లో పర్యటించమని కోరాడు. వీధులకు తమ పేర్లు పెట్టడం, శిలాఫలకాలు చేయించడంతో సంపన్నులలో రెట్టింపు ఉత్సాహం వచ్చింది. ఊహించని గుర్తింపుకు వారు ఉబ్బితబ్బియ్యారు. సమాజంలో తమ పేరు ప్రతిష్ఠలు పెరిగాయని పొంగిపోయారు. చెడ్డ పేరు రాకుండా తమకి అప్పగించిన వీధులను శుభ్రంగా ఉంచుకోవడం ప్రారంభించారు. పిల్లలు వీధులకు ఇరు వైపులా మొక్కలు నాటడంతో వీధులన్నీ రంగుల హరివిల్లు లైనాయి. ఎప్పటికప్పుడు ఆక్రమణదారుల వివరాలు రాజుకు అందించి ఆక్రమణలను నియంత్రించారు. ఆదాయం పోగొట్టుకున్న ఆక్రమదారులు తప్పు తెలుసుకున్నామని, క్షమాపణలు కోరడంతో రాజు వెంటనే ఒక వ్యాపార కేంద్రాన్ని ఏర్పాటు చేసి వారికి ఆశ్రయం కల్పించాడు. కొద్ది రోజులు గడిచాక నగరం రూపురేఖలు మారిపోయాయి. గ్రామస్తుల, పొరుగు రాజ్యాల వ్యాపారుల రాకపోకలు తిరిగి ప్రారంభమై వ్యాపారం ఊపు అందుకుంది.

**- ఆర్.సి.కృష్ణస్వామి రాజు**





## వార్త ఆదివారం


### బాలగేయం

#### క్రమశిక్షణ



చిన్న ఎర్ర చీమరా
నా కాలుపైకి ఎక్కెరా
గట్టిగా కుట్టెరా
నాకు మంట పుట్టెరా
తాత చూసి నవ్వెరా
అంత చిన్న చీమరా
తీసి బయట వేయురా
శివునాజ్ఞ చేత కుట్టెరా
దాన్ని కొట్టవద్దురా
కొట్టుకుంటూ పోవద్దురా
దాని పనులు ఆపదురా
క్రమశిక్షణకు పేరురా

**- పెందోట వెంకటేశ్వర్లు,** సిద్ధిపేట



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎస్.ప్రభాకర్,** హైదరాబాద్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. మన కన్నును ఓ సాధారణమైన కెమెరా కన్నా వీడియో కెమెరాతో పోలుస్తారు. కారణమేంటి?

**జవాబు:** ప్రభాకర్! గుండ్రంగా కుంభాకారంలో ఉండే కార్నియా ద్వారా కాంతి, కంటిలోకి ప్రసరించడంతో కంటితో చూస్తున్న బొమ్మ తలకిందులుగా కార్నియా వెనుకనున్న రెటీనా మీద పడుతుంది. అదే కెమెరాలో అయితే ఫొటోగ్రాఫిక్ ప్లేటు మీద ఏర్పడిన బొమ్మ కొన్ని కాంతి రసాయన చర్యల ద్వారా ఏర్పడుతుంది. ఈ విధంగానే బొమ్మ మన కంటిలో ఏర్పడితే మనం ప్రతీదాన్ని తలకిందులుగానే చూడాల్సి ఉంటుంది. మనం చూస్తున్న బొమ్మలన్నీ నిజానికి రెటీనా మీద స్థిరంగా ఉండవు. ఎందుకంటే ఇవి విద్యుత్ సంకేతాలుగా మారి, మెదడుకు చేరి, అక్కడ సరైనవిగా మారతాయి. వీడియో కెమెరాలోనూ బొమ్మలన్నీ ఫొటోగ్రాఫిక్ ప్లేట్ మీద స్థిరంగా ఏర్పడవు.

**- సుభద్ర,** కాకినాడ

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నిద్ర లేకపోతే కళ్లు ఎందుకు ఎర్రగా కనిపిస్తాయి?

**జవాబు:** సుభద్ర! మనకు కనిపించే దృష్టి వెనుక కండరాల చర్య ఎంతో ఉంది. మన కంటికి కనిపించినంత మేరలోని వస్తువులపై దృష్టిని కేంద్రీకరించడానికి కండరాలు అవసరం. మనం ఒక వస్తువు మీద దృష్టిని ఏకాగ్రతగా ఉంచినప్పటికీ కన్ను స్థిరంగా ఉండక చిన్న చిన్న కదలికలు చేస్తుంది. ఈ చర్యను కొనసాగించడానికి, కండరాలకు శక్తినివ్వడానికి అవసరమైన రక్తాన్ని సరఫరా చేసేందుకు, కంటిలో కేశనాళికల నెట్‌వర్క్ ఉంటుంది. ఈ కండరాలునిద్ర లేమి కారణంగా ఎక్కువగా శ్రమించినప్పుడు అదనపు ఆక్సిజన్ చేరడానికి అధిక రక్తం సరఫరా అవసరమవుతుంది. ఈ అదనపు రక్తం సూక్ష్మమైన కేశనాళికల గుండా ప్రవహించినప్పుడు ఎరుపు రంగుకు మారుతుంది. దీంతో రాత్రిపూట నిద్ర లేనివారి కళ్లల్లో ఎర్రజీరలు కనిపిస్తాయి.





# ఐస్‌క్రీమ్‌ను తినేద్దాం..

**పుట్టినరోజు,** పెళ్లిరోజు లాంటి వేడుకల్లో అతిథులకు వడ్డించే పదార్థాలే కాదు, వాటిని వడ్డించే ప్లేట్లూ, గిన్నెలూ కూడా వినూత్నంగా, అందంగా ఉండాలని చాలా మంది అనుకుంటారు. అందుకోసం తమదైన సృజనతో కొత్త కొత్తగా ఆలోచిస్తుంటారు. అలా రూపుదిద్దుకున్నవే ఈ ఐసుగిన్నెలు. పూల డిజైన్లు ఉన్న గాజుగిన్నెల్లా మెరిసే ఈ మంచు బౌల్స్‌లో ఐస్‌క్రీమ్‌నో, కస్టర్డ్‌నో సార్బెట్‌నో, డెజర్ట్‌నో వడ్డించి ఇంటికి వచ్చిన స్నేహితుల్నీ, బంధువుల్నీ చకితుల్ని చేస్తున్నారు.

## ఎలా చేస్తారు?

ముందుగా ఒకదాంట్లో ఒకటి పట్టేలా రెండు విభిన్న సైజుల్లో ఉన్న ప్లాస్టిక్ లేదా గాజుగిన్నెల్ని తీసుకోవాలి. ఈ రెండింటికీ మధ్య కనీసం ఒకటిన్నర సెం.మీ. ఖాళీ ఉండాలి. పెద్దగా ఉన్న గిన్నెలో అడుగున కొన్ని పూలనీ, రేకల్నీ, ఆకుల్నీ పేర్చుకుని చల్లని నీళ్లు పోసి రెండో గిన్నె పెట్టాలి. తరువాత రెండు గిన్నెల మధ్య కూడా నచ్చిన పువ్వుల్నీ, పండ్లముక్కల్నీ అమర్చాలి. ఇప్పుడు రెండో గిన్నె మీద ఏదైనా ప్లేటుని మూతపెట్టి ఈ మొత్తాన్ని ఫ్రీజర్‌లో పెట్టి కనీసం ఆరు గంటలు ఉంచాలి. అది గడ్డకట్టాక బయటకు తీయాలి. ముందుగా మూత తీసి చిన్నగిన్నెలో కొన్ని నీళ్లు పోస్తే అది సులభంగా వచ్చేస్తుంది. ఆ తరువాత ట్యాప్ నీళ్ల కింద పెద్ద గిన్నెను వెనక్కి తిప్పి పెడితే ఐసుగిన్నె బయటకు వస్తుంది. రంగుల పూతోనూ పండ్ల ముక్కలతోనూ ఉండే ఈ ఐసుగిన్నె చూడ్డానికి అందంగానే కాదు, అందులో చల్లని పదార్థాలను వడ్డిస్తే అవి మరికాసేపు చల్లదనం పోకుండా ఉంటాయి.

అందమైన ఐసుగిన్నెల్ని తయారు చేయడం నిజానికి విదేశాల్లోనే ఎక్కువ. అక్కడ పెళ్లివేడుకలు లేదా పార్టీల్లో టేబుల్ అందంగా కనిపించేందుకు పూలూ, పండ్లతో చేసిన ఐస్‌క్యూబ్స్‌ను గ్లాసుల్లో, బౌల్స్‌లోనూ వేసి ఉంచేవారు. వాటిని కాక్‌టెయిల్స్, మాక్‌టెయిల్స్‌లో కలుపుకునేవారు. కొందరు నీటిలోనూ వేసుకుని తాగేవారు. గులాబీ రేకులు, వయొలెట్స్, లావెండర్ పూలు, ఔషధ గుణాలున్న పుదీనా, లెమన్‌బామ్, రోజ్‌మెరీ, సోంపుఆకులూ, రాస్బెర్రీ, రెడ్ కరెంట్, స్ట్రాబెర్రీ వంటి పండ్లముక్కలను వేసి చేయడంతో ఆ ఫ్లేవర్ దిగి నీళ్లు రుచిగా ఉంటాయి. తరువాత కరిగిన ఆయా ఆకుల్నీ, పండ్లనీ హాయి చప్పరించవచ్చు. అలా మొదలైన ఐసు అలంకరణ ఇప్పుడు గిన్నెల్లోకి మారిందని చెప్పవచ్చు. చల్లని పదార్థాలను ఈ గిన్నెల్లో వడ్డిస్తే ఎక్కువసేపు చల్లగా, త్వరగా కరిగిపోకుండా ఉంటాయట. ఇలా చేసుకున్న ఐస్‌బౌల్స్‌ను గాలి చేరని కంటెయినర్‌లో పెట్టి ఫ్రీజర్‌లో పెడితే కొన్ని రోజులవరకు అలాగే ఉంటాయి. ❑





# ముగ్గురు బిచ్చగాళ్లు

**ఒక** ఊళ్లో ఓ పెద్దాయన ఉన్నాడు. ఆయన కోటీశ్వరుడు. ఆయన అనేక మంచి పనులు చేస్తూ వచ్చాడు. ఆయనను వెతుక్కుంటూ అనేక మంది వచ్చిపోతుండేవారు. ఆయన వారికి తనకు చేతనైన సాయం చేస్తుండేవారు.
ఓమారు ముగ్గురు బిచ్చగాళ్లు ఆయన దగ్గర సాయం పొందాలనుకున్నారు. అయితే ఆ ముగ్గురూ ఒకేసారి రాలేదు. ముగ్గురూ మిత్రులే. కనుక విడివిడిగా వెళ్లాలనుకున్నారు. ఆయన దగ్గర ఏదో రూపంలో సాయం పొందాలనుకున్నారు.
మొదటి బిచ్చగాడు ఉదయం వచ్చాడు. ఆయన ఎదుట నిల్చున్నాడు.
"అయ్యా, నాకు యాభై రూపాయలు కావాలి. దయచేసి ఇవ్వండి" అని అడిగాడు.



అతనలా అడగడంతో కోటీశ్వరుడికి కోపం వచ్చింది.
"ఏమిటీ? నువ్వడిగే తీరు ఎలా ఉందో తెలుసా? ఎవరైనా చూసారంటే నేనేదో నీ దగ్గర అప్పు తీసుకున్నట్టు, దానిని తిరిగివ్వమని నువ్వడుగుతున్నట్టు అనుకుంటారు. నీ మాటధోరణి నచ్చలేదు. నీకెంత ధైర్యం! నీకు యాభై రూపాయలు ఇవ్వడం కుదరదు. ఇదిగో ఇరవై రూపాయలు ఇస్తాను. తీసుకుని పారిపో. నా కళ్లముందు కనిపించకు" అన్నాడు కోటీశ్వరుడు.
ఆ ఇరవై రూపాయల నోటుని విసిరేశాడు. అతను దానిని తీసుకుని వెళ్లిపోయాడు.
ఆ తర్వాత మధ్యాహ్నం రెండో బిచ్చగాడు వచ్చాడు. "పది రోజులైందయ్యా సరిగ్గా అన్నం తిని. అర్ధాకలితో మాడుతున్నానయ్యా.. దయచేసి నాకు సాయం చేయండి" అన్నాడు.
"నీకు ఎంత కావాలి?" అని అడిగాడు కోటీశ్వరుడు.
"మీరెంతనుకుంటే అంత ఇవ్వండి. నాకది చాలు" అన్నాడు రెండో బిచ్చగాడు.
"ఇదిగో వంద రూపాయలు, తీసుకో. ఏదైనా కొనుక్కుని తిను" అన్నాడు, ధనవంతుడు.
అతను ఆ వంద తీసుకుని వెళ్లిపోయాడు.
అనంతరం సాయంత్రం మూడో బిచ్చగాడు వచ్చాడు.
"మహారాజా! మీ గుణం ఎంతో గొప్పదని చాలా మంది చెప్పగా నేను విన్నాను. కనుక మీ దర్శనం చేసుకుని వెళ్లాలనుకున్నాను" అన్నాడు. మీరు నిజంగా ప్రత్యక్ష దైవమే" అన్నాడు.
వెంటనే ఆ ధనవంతుడు "అయ్యా, దయచేసి కూర్చోండి. మీరు బహుదూరం నుంచి వస్తున్నట్టున్నారు. అలసిపోయి కనిపిస్తున్నారు. ముందుగా కాళ్లు కడుక్కుని వచ్చి కూర్చోండి. అన్నం పెడతాను. మిగిలిన విషయాలన్నీ తర్వాత మాట్లాడుకుందాం" అంటూ అతనికి విస్తరి వేసి స్వయంగా వడ్డించారు.
అతను తృప్తిగా తిన్నాడు.
అనంతరం ఆ ధనవంతుడు ఇలా అడిగాడు..
"ఇప్పుడు చెప్పండి.. నేను మీకు ఏం చేయాలి?" అని.
అప్పుడూ బిచ్చగాడు "మీ అభిమానం నన్నెంతో ఆకట్టుకుంది. అయ్యా, ఆకలితో వచ్చాను. రుచికరమైన భోజనం పెట్టారు. కడుపారా తిన్నాను. అది చాలు. నాకింకేమీ అక్కర్లేదు. మీరు నా పట్ల చూపిన అభిమానాన్ని ఎప్పుడూ మరిచిపోలేను. మీకన్నీ మంచిగా జరగాలని కోరుకుంటున్నాను. ఏ లోటూ లేకుండా సాగిపోవాలి మీ జీవితం" అని మనసారా చెప్పాడు, బిచ్చగాడు.
అతని మాటలు ధనవంతుడి హృదయాన్ని కట్టిపడేసాయి. అతని పట్ల ఆయన అభిమానం మరింత పెరిగింది.
తత్ఫలితంగా ఏం చేశారో తెలుసా..
"ఇదిగో చూడు నాయనా! ఇకమీదట నువ్వెక్కడికీ వెళ్లనక్కర్లేదు. ఇక్కడే ఉండు" అన్నాడు, ఆ బిచ్చగాడితో. తనుండే ఇంటి పక్కనే అతనికో ఇల్లు సిద్ధం చేశాడు. చివరి వరకూ అతనిని అక్కడే ఉండనిచ్చాడు.
ఈ కథను స్వామి శివానంద చెప్పారొకమారు.
భగవంతుడు ఆ కోటీశ్వరుడిలాగట. ఆ మూడు రకాల బిచ్చగాళ్లు మూడు రకాల భక్తులు.

...

ఈ రోజుల్లో ఉన్న భక్తులు ఈ మూడు వర్గాల కిందకు వస్తారు. అయితే వీరిలో మొదటి వర్గంవారే అధికమంది. మూడో రకంవారు చాలా తక్కువ.
నాకు తెలిసిన ఓ ఊరి పక్కన ఓ పెద్దాయన ఉండేవారు. ఆయన ఖర్చు చేయడానికి భయపడుతుండేవారు. ఎవరికైనా ఓ రూపాయి ఇవ్వాలన్నా పది రకాలుగా ఆలోచిస్తారు. ఆయనను వెతుక్కుంటూ ఓరోజు కొందరు బిచ్చగాళ్లు వచ్చారు.
అయ్యా, మేమందరం కలిసి ఓ బిచ్చగాళ్ల సంఘం ఏర్పాటు చేయాలనుకున్నాం. ఆ సంఘానికి మీరు మీ వంతుగా వెయ్యి రూపాయలు విరాళంగా ఇవ్వాలి" అని అడిగారు.
అయితే ఆ పెద్దాయన "అవన్నీ ఇవ్వడం కుదరదు, నా దగ్గర అంత డబ్బు లేదు.. పొండి" అన్నాడు.
"సరేనండీ, ఓ వంద రూపాయలైనా ఇవ్వండి" అని అడిగారు ఆ బిచ్చగాళ్లు.
"అది కూడా ఇవ్వనన్నాడు" పెద్దాయన.
"సరేనండీ... ఓ పది రూపాయలైనా ఇవ్వండి" అని అడిగారు.
"అదీ ఇవ్వనన్నాడు... మీకెందుకివ్వాలి" అని ఎదురు ప్రశ్నించారు.
దాంతో ఆ బిచ్చగాళ్లు "సరేనండీ, అయితే మీరొకటి చేయండి" అన్నారు.
"ఏం చేయాలి?" అని అడిగాడు పెద్దాయన.
"మీరూ మా సంఘంలో సభ్యులుగా చేరండి" అని అందరూ కలిసి ఒక్కటిగా చెప్పారు.

**- యామిజాల జగదీశ్**

కథ

# కాంతులీనుతున్న మనసు

ప్రతాప వెంకట సుబ్బారాయుడు

**ఉదయం..**

**లోటస్ టెంపుల్, న్యూ ఢిల్లీ.**

**వాతావరణం చల్లగా, ఆహ్లాదంగా ఉంది. సూర్యబింబం కనిపించడం లేదు. వెలుగును బట్టి సూర్యుడి ఉనికి తెలుస్తోంది.**

**కుల మతాలకతీతంగా ప్రార్థనలు చేసుకునే ప్రదేశం ఒకటుందని, అదీ మన దేశంలోనే గూగుల్‌లో సెర్చ్ చేస్తే తెలిసి ఇక్కడికి వచ్చాను.**

భిన్నత్వంలో ఏకత్వానికి అద్దం పడుతున్న వసుధైన కుటుంబాన్ని ప్రతిఫలింపచేస్తూ, అంత మంది కలిసిమెలిసి మౌన ప్రార్థనలు చేస్తుంటే చూడముచ్చటేసింది. ముఖ్యంగా చిన్నతనంలోనే పిల్లల్లో ఆ బీజం పడడం ముదావహం.

కళ్లు మూసుకుని ధ్యానంతో మనసును, శరీరాన్ని ఒక కేంద్ర బిందువులో లయం చేసి, తాదాత్మ్యంతో ప్రశాంతంగా లోపల కొంతసేపు గడిపి బయటకొస్తున్న నాకు ఒక వ్యక్తి కనిపించాడు.

అతనికి సుమారు ముప్ఫై ఏళ్లుంటాయి. కళ్లల్లో, ముఖంలో నేనెవరిలోనూ, ఎన్నడూ చూడనంత ప్రశాంతత ద్యోతకమవుతోంది. అతన్నెందుకో పలకరించాలనిపించింది. బహుశా అతని ముఖం చూడగానే నా మనసులో "మన ప్రాంతం వాడే" అన్న భావం కూడా కదలాడినందుకేమో? అతను కొంత దూరం నడిచి, పచ్చికబయల్లో కూర్చున్నాడు.

నేను అతనికి దగ్గరగా వెళ్లి కూర్చున్నాను. నన్ను చూసి నవ్వాడు.

కాసేపు అక్కడున్న పచ్చదనాన్ని, పక్షుల కిలకిలలను ఆస్వాదించి, "మీరు తెలుగువారు కదూ..!" అన్నాను.

అవునన్నట్టుగా చిరునవ్వు నవ్వాడు.

"నా పేరు విశిష్ట్. మాది విజయవాడ. నేను ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్నాను. సమయం చిక్కినప్పుడల్లా మన దేశంలోని ప్రఖ్యాత గుళ్లు, గోపురాలు, చారిత్రక ప్రదేశాలు చూస్తాను. నెట్లో లోటస్ టెంపుల్ గురించి చదివి జాతి, కుల, మతాలకతీతంగా స్త్రీ, పురుష భేదం లేకుండా ఇందులోకి ప్రవేశించి మౌన ప్రార్థనలు చేసుకోవచ్చని చదివి మొట్టమొదటిసారి ఇక్కడికొచ్చాను. ఇదో మధురానుభూతి. మరి మీరు?"



"నా దేహానికి ఉన్న పేరు కిరణ్, నా అసలు పేరు కులాన్ని ప్రతిబింబిస్తూ ఉండేది. దాన్ని తొలగించుకుని అధికారికంగా కిరణ్ అని మార్చుకున్నాను. సూర్యకిరణం ప్రకృతి ప్రసాదితం. ఎటువంటి వివక్షలు చూపకుండా, జగతిని జాగృతం చేస్తుంది. అందుకే ఆలోచించి ఆ పేరు పెట్టుకున్నాను. నేను సంవత్సరానికి ఒకటి రెండు సార్లు ఇక్కడికి వస్తాను. ఇంకే పర్యటనలూ చేయను. ఉద్యోగం చేయడం బతకడానికి. ఇదిగో ఇక్కడికి వచ్చి ఇలా మానసిక ప్రశాంతత పొందడానికి.. అంతే!" అన్నాడు.

"మిమ్మల్ని పలకరించాలని నాకెందుకు తీవ్రంగా అనిపించిందో ఇప్పుడు అర్థమవుతోంది. మీకు అభ్యంతరం లేకపోతే మీతో కొంత సమయం గడుపుతాను" అన్నాను.

అతనేమనుకున్నాడో కానీ కొంతసేపటి మౌనం తర్వాత ఒప్పుకున్నట్టుగా తలూపాడు.

"మీరు కేవలం ఇక్కడికే వస్తానన్నారు, మన దేశంలో ఆధ్యాత్మిక ప్రత్యేకతలు, మహాత్మ్యాలతో అలరారే ఆలయాల సందర్శనం చేయరా?" అడిగాను.

అతను ఆకాశంలో గిరికీలు కొడుతూ విహరిస్తున్న పక్షిని చూస్తూ–

"పుట్టింది మొదలు చనిపోయేవరకు మనిషి మనశ్శాంతిని అభిలషిస్తాడు. పుట్టింది ఏ జాతిలో, కులంలో, మతంలో అయితే ఆయా సంప్రదాయాల వృత్తంలో అలుపు లేకుండా తిరుగుతుంటాడు. విచిత్రమేమిటంటే తను మనిషినన్న విషయం మర్చిపోయి ఆయా జాతి, కుల, మతాలకు ప్రాతినిధ్యం వహించడంలో తలమునకలవుతాడు. అందులో మనశ్శాంతి లభిస్తుందని ఆరాటపడతాడు. నిజానికి మనశ్శాంతి అందులో ఉండదు.

దేవుణ్ని నమ్మితే ఆస్తికుడు లేదంటే నాస్తికుడన్న ముద్ర. మరి కంటికి ఎదురుగా ఉండే మనిషిని నమ్మితే? ఏమనాలి? మనిషికి కష్టమొస్తే ఆదుకునేది మనిషా? దేవుడా? సమయానికి మనిషి సహాయం చేసినా దేవుడా రూపంలో వచ్చాడని మురిసిపోవడం నా దృష్టిలో పిచ్చితనానికి పరాకాష్ఠ!"

ఒక వ్యక్తి వయసు నలభై ఉండొచ్చు, ఐదడుగుల ఆరంగుళాలుంటాడు. తెల్లటి లాల్చీ, పైజామా ధరించి ఉన్నాడు. మా వైపుగా వచ్చి మాకు కొద్ది దూరంలో అటువైపుగా ముఖం చేసుకుని కూర్చున్నాడు. అతనివంకోసారి చూసి కిరణ్ చెప్పడం ప్రారంభించాడు.

“అంటే మీ దృష్టిలో ఆస్తికత్వానికి విలువ లేదా?” ప్రశ్న అడగొచ్చో లేదో అనుకుంటూనే అడిగేశాను.

“మనిషితత్వాన్ని మరుగున పడేసే ఆస్తికత్వం ఎందుకు? మానవుడే మాధవుడంటారుగానీ చేతల్లో అది కనిపించదు. ఎవరికన్నా ఉపకారం చేయాలంటే మనసులో ఎన్ని లాభనష్టాలు బేరీజులేసుకుంటారో. లోకంలో పుణ్యం అన్న మాట లేకపోతే సహాయ సహకారాలన్నీ చాలావరకు సద్దుమణిగిపోతాయి”.

అతనన్న మాటల్లో వాస్తవం ఉంది. చిన్నప్పట్నుంచి పాపం పుణ్యం అందరి మనసు పొరల్లో నిక్షిప్తమయిపోయాయి. ఏది పాపమో, ఏది పుణ్యమో మన పెద్దవాళ్లు నిర్దేశించారు. పాపం చేయడానికి కొంతమంది మనసు జంకుతుంది. అందుకనే ప్రపంచం ఈ మాత్రం నిలకడగా ఉంది. లేకపోతే అంతా అరాచకం, అస్తవ్యస్తమే!

“మన పురాణాలు, ఆధ్యాత్మిక గ్రంథాలు, దానం, ధర్మం, నీతి, మనవత్వాలకు పెద్ద పీట వేశాయి కదా?” అతనికి పురాణ పరిచయం ఉందో, లేదోనని అసంశయిస్తూ అడిగాను.

“ఒక్క హిందూమతంలోనే కాదు.. ఏ మత సాహిత్యంలోనైనా, సమాజ వికాసానికి మనిషి గుణగణాలు ఎలా ఉండాలన్న సారాంశాన్ని పక్కనపెట్టి, వ్యక్తులకు పట్టం కట్టారు. రామాయణం విషయం తీసుకుంటే “మనిషి ఎలా ఉండాలి?” అనే విషయాన్ని గ్రహించాల్సింది పోయి రాముణ్ని దేవుణ్ని చేసి అడుగడుగునా గుడి కట్టి పూజిస్తున్నారు. భాగవతం కృష్ణుణ్ని భగవంతుణ్ని చేసింది. బైబిల్ క్రీస్తును చర్చిలో నిలిపింది. ఖురాన్ మహ్మద్ ప్రవక్తకు పట్టం కట్టింది. ఏ గ్రంథంలోనైనా ఆనాటి సామాజిక పరిస్థితులను పరిచయం చేస్తూ, మనుషుల విచిత్ర పోకడలను, రాక్షసత్వాన్ని, పైశాచికత్వాన్ని చిత్రిస్తూ ఒక చరిత్రాంశంలా “మనిషన్నవాడు అలా ఉండకూడదు” ని హెచ్చరించింది. మనిషితత్వాన్ని, మానవత్వాన్ని అవతార రూపంగా విస్తృతపరిచింది. సద్గుణాలను, సత్ప్రవర్తనను అలవరచుకోకుండా కేవలం చదవడం, మనిషిని పరమాత్ముణ్ని చేయడం, పూజించడం పారమార్థికత అనుకుంటే ఎలా?

దేవుడు గుణాతీతుడు, సర్వోన్నతుడు (మానసిక స్థితిలో) అనుకుంటే పూజలు, మొక్కులు, కానుకలు, సేవలకు లొంగే అల్పమనస్కుడిగా చూడడం మన అధమ మానసిక స్థాయికి సూచిక కాదా? పిండికొద్దీ రొట్టెలాగా, డబ్బుకొద్దీ దర్శనం ఎంత హాస్యాస్పదం. దేవుడు ఒక్కడే అంటారు. కానీ ఒక్కొక్కరికీ ఒక్కో దేవుడు. దేవుడు ఎక్కడో లేడు హృదయంలో కొలువుంటాడని చెబుతూ అవిశ్రాంతంగా కొండలు కోనలు తిరుగుతుంటారు. మనోస్థిరత్వం లేని మనిషికి అసలంటూ దేవుడనేవాడుంటే పట్టుపడతాడా?”

“మిమ్మల్ని ప్రశ్నలతో విసిగిస్తున్నాను కోవద్దు. సూర్యబింబంలా బహిర్గతమవుతున్న మీ అంతరంగం ఇన్నాళ్లుగా నా మనసుకు చుట్టుకున్న చీకటిపొరలను తొలగిస్తోంది. కొత్త విషయాలు తెలుస్తున్నాయి. ఆధ్యాత్మికత అనే మత్తు మానవ జాతిని పట్టి పీడిస్తోందన్న విషయం క్రమంగా అర్థమవుతోంది”.

అంతలో ఓ చిన్నపిల్ల విసిరిన బంతి తన దగ్గరికి రావడంతో, దాన్ని తీసుకెళ్లి ఆ పిల్లకిచ్చి, వచ్చి కూర్చున్నాడు కిరణ్.

తర్వాత మళ్లీ కొనసాగిస్తూ “ఇదిగో ఇప్పుడు నేను చేసిన ఈ చిన్న పని ఆ పసి మనసులో లోకం మొత్తం మంచిదన్న విత్తనం వేస్తుంది” అని చెప్పి- “ప్రపంచంలో రెండు రకాల మనుషులు ఉంటారు. ఒకరు తమ మేధతో దేన్నైనా కనిపెట్టేవారు. మరొకరు దాన్ని ఉపయోగించుకునేవారు. మన వెనకటి తరాల్లోని మేధావులు దేవుణ్ని కనిపెట్టారు. దాన్ని ఉపయోగించుకుని అప్పటి నుంచి ఇప్పటిదాకా కొంత మంది బతుకుతున్నారు. అంటే కోపం వస్తుంది గానీ ఇదీ తరతరాలుగా సాగుతున్న లాభసాటి వ్యాపారమే. అనుకున్నది జరిగితే దైవలీల అనుకుంటారు, జరక్కపోతే మనలోనో, మన పూజలోనో లోపం అనుకునే చిత్రమైన స్థితిలో ఉంటారు. అదో మానసిక బలహీనత అనుకోకుండా, చాలా మంది దాన్నే గుడ్డిగా అనుసరిస్తున్నారు”.

ఒక వ్యక్తి వయసు నలభై ఉండొచ్చు, ఐదడుగుల ఆరంగుళాలుంటాడు. తెల్లటి లాల్చీ, పైజామా ధరించి ఉన్నాడు. మా వైపుగా వచ్చి మాకు కొద్ది దూరంలో అటువైపుగా ముఖం చేసుకుని కూర్చున్నాడు.

అతనివంకోసారి చూసి కిరణ్ చెప్పడం ప్రారంభించాడు.

“పోయిన్నెల మా నాన్నగారు చనిపోయారు. కార్యక్రమ నిర్వహణకు, దానాలకు బ్రాహ్మణులు ఖరీదైన ప్యాకేజీ చెప్పాడు. నేను ఓ చిన్న ఉద్యోగిని. ప్రైవేటు ఉద్యోగి అయిన మా నాన్న సంపాదించిన అరకొర డబ్బు ఇలా దానధర్మాలకు, కర్మలకు ఖర్చుపెడితే రేపటి రోజున మా అమ్మ ఎలా బతుకుతుంది? మా నాన్న ఆత్మశాంతి అన్నది ఆయన పార్థివ శరీరానికి చేసే కర్మల్లో కాదు, మా అమ్మ ఏ చీకూ చింతా లేకుండా బతకడంలో ఉంటుందనిపించి, విద్యుత్ దహన వాటికలో దహనం చేయించాను. పన్నెండు రోజుల కార్యక్రమాలు సామాన్యంగా జరిపించాను. చుట్టాలనబడేవాళ్ల నోళ్లు రకరకాలుగా మాట్లాడాయి. పట్టించుకోలేదు.

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: **ఎడిటర్, ఆదివారం వార్త**, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080. sunmagvaartha@gmail.com

పది మంది కోసం కాకుండా మనకు తోచింది సవ్యంగా చేయడం సంస్కారం అనిపించింది, అదే చేశాను.

ప్రకృతిలో పంచభూతాల ధర్మాలు అన్నిచోట్లా ఒకేలా ఉంటాయి. అది శాస్త్రం. అదే సత్యం. కానీ మరణించడం తర్వాత చేసే తతంగం ఒక్కో జాతి, మత, కులం, తెగలో ఒక్కో రకంగా ఉంటుంది. ఎవరికి వారు తమవారికి సద్గతులు ప్రాప్తించాయని మానసికంగా సంతృప్తిని పొందుతారు. మరి ఏ పద్ధతిలో మరణించిన వారి ఆత్మకు నిజమైన శాంతిని ప్రసాదిస్తుంది? సమాధానం దొరకని ప్రశ్న ఇది. పుట్టిన జీవికి మరణం అనివార్యం. ఏ ఇతర జీవికీ లేని కర్మకాండలు మనిషి తన తెలివితో మనిషి కోసం రూపొందించాడు. దాన్ని అలా గుడ్డిగా అమలు పరుస్తారు చాలామంది. మన దేశంలో చనిపోయినవారి అస్థికలను పవిత్ర నదుల్లో కలుపుతారు. ఒకవేళ ఒక దేశంలో అలాంటి నది ఒక్కటీ లేకపోతే అది ఆ చనిపోయిననాడు చేసుకున్న దౌర్భాగ్యమా? వాడి ఆత్మ పవిత్రత నొందదా? అసలు ఆత్మ అంటే జీవికి శరీర పంజరం నుంచి స్వేచ్ఛ లభించే గాలి అని, ఎటువంటి వికారాలు సోకని పవిత్రమైనదని అంటారు కదా, మరి దానికి శాంతి లభించడమేంటి? కాస్త నిదానంగా ఆలోచిస్తే ఇక్కడే మన పూర్వీకుల తెలివితేటలు స్పష్టమవుతాయి".

ఏవిటీ మనిషి? నా మనసు చీకట్లో దీపం వెలిగించి క్షణక్షణానికీ కాంతి పెంచుతున్నాడు. ఆలోచనలు కొత్త దారి పడుతున్నాయి. ఇతడు సన్యాసి, స్వామీజీ, ప్రవచనకారుడూ కాడు. మామూలు మనిషి. అయినా తరతరాలుగా పేరుకుపోయిన సంప్రదాయ మకిలీని మాటల్తో శుభ్రం చేసి, కంపు కొడుతున్న హృదయాన్ని ఉతికి ఆరేస్తున్నాడు.

మాకు కొద్ది దూరంలో కూర్చున్న వ్యక్తి మా వైపు తిరిగాడు.

"మన దేశంలో ఎన్నో ఆశ్రమాలు ఉన్నాయి. ధర్మ ప్రవచనాలు చెబుతూ నీతిని బోధించే స్వామీజీలు ఉన్నారు. అనుసరించే వందలు, వేలు, లక్షల శిష్యగణాలు ఉన్నారు. అయినా పేపరు తిరగేస్తే మానవ మృగాల సంచారం, వారి అకృత్యాలు, ఆగడాలు మితిమీరి కనిపిస్తాయి. సన్యాసులు ఎక్కడో ఆశ్రమాల్లో ఒక మూల కూర్చుని ధ్యానంలో, సత్సంగాల్లో కాలం వెళ్లదీసే బదులు సమాజంలో సంచరిస్తూ నేరాలను అడ్డుకోవచ్చు కదా, రక్షణ కవచంలా మారొచ్చు కదా. ఊహూ.. అలాంటివేం చేయరు.

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సైనికులు, భద్రతా సిబ్బంది, సాధారణ మనుషులు సహాయక చర్యల్లో పాల్గొంటారు కానీ కాషాయంబర ధారులందరూ ఊకుమ్మడిగా పాల్గొని సహాయ సహకారాలు అందించవచ్చు కదా! అలా చేయరు. దీని అర్థం ఏమిటి? మనిషిలోని దేవుణ్ణి వాళ్లు చూడలేకపోతున్నారనే కదా! ఆధ్యాత్మికత ముసుగు అర్థం లేనిదనే కదా? మనసు గంగ కానప్పుడు, శరీరం గంగానదిలో మునకలేయడం అవివేకం.

నేనందుకే దేవుళ్లు, పూజా తతంగాలు లేని, ఆధ్యాత్మికత ముసుగులో వ్యాపారం కనిపించని మానసిక ప్రశాంతతనిచ్చే ఈ ప్రదేశానికి వస్తాను. ఇక్కడ మనుషులు, మనసులు ఒక్కటిగా ఉంటాయి. దానిని మౌనంగా అనుభూతిస్తాను".

ఇతన్ని కలిసేవరకు దేవుణ్ని వెదికే పనిలో ఉండేవాణ్ని. ఇప్పుడు దేవుడు మన పక్కనే మరో మనిషి రూపంలో ఉన్నాడన్న ఉనికి లభించింది. అన్నట్టు దేవుడంటే పంచభూతాలు, వాటి కలయిక అయిన జీవ జంతుజాలం. ప్రకృతిలోకొచ్చి, సంచరించి, ప్రకృతిలో కలిసిపోడానికి మధ్య ఎన్ని నమ్మకాలు? మూఢనమ్మకాలు? విశ్వాసాలు? మనిషి ప్రశాంతత అతని ఆలోచనా విధానం లోనూ, నిత్య జీవిత కర్మాచరణలోనూ ఉంటుంది. అది వదులుకుని ఒంటిపూట తింటూ డబ్బులు కూడబెట్టుకున్నామని దూరాభారాలు భరించి ఆలయాలు తిరగడం, ఎవరో పెద్ద(?) మనిషి ఆసువుగా చెప్పే మాటలు నాగస్వర శబ్దంగా గ్రహించి తలలూపడం, మతమార్పిడులు, వేధింపులు ఇది మనకోసం మనం సృష్టించుకున్న మరో కలుషిత ప్రపంచం కాదా?

నేను ఆలోచనలో ఉండగానే మాకు కొద్ది దూరంలో కూర్చున్న వ్యక్తిని, మరో మనిషి తీసుకెళ్లడానికి వచ్చాడు. వాళ్లూ తెలుగువాళ్లు అని వారి మాటలను బట్టి అర్థమైంది.

కిరణ్ మాటలు నచ్చినట్టుగా అతడు బొటనవేలు, చూపుడువేలు కలిపి సంజ్ఞ చేశాడు.

ఆ వ్యక్తి మూగవాడన్న విషయం అతని పక్కనున్న మనిషి చెప్పాడు.

"మీ మాటలు అతణ్నీ ప్రభావితం చేశాయి" అన్నాను నవ్వుతూ.

"ప్రభావం అన్న మాట నాకు నచ్చదు. ఎవరి ప్రభావం, దేని ప్రభావం ఎవరి మీదా ఉండకూడదు. స్వతంత్రంగా ఆలోచించకపోవడమే ఇప్పటి ఈ మనస్థితికి కారణం. ఎవరేం చెప్పినా వింటాం. కాస్తయినా ఆలోచించం. మానవుడు విచక్షణతో జన్మించింది.. ప్రకృతికి ఏదైనా ఉపకారం చేయడానికి, కానీ మనిషితో సహా ప్రకృతీ అపకారమే జరుగుతోంది. నేనెవరు? ఎక్కడి నుంచి వచ్చాను? అన్న సృష్టి రహస్యాన్ని తెలుసుకోడానికి కొంతమంది సంప్రదాయవాదులు, ఛాందసులు తెగ తాపత్రయపడుతుంటారు. అది అనవసరం అని నా అభిప్రాయం. ఎక్కడి నుంచి వచ్చాం, ఎక్కడికి వెళతామన్నది సృష్టికర్త చూసుకుంటాడు. భూమ్మీదకు మనం వచ్చినందుకు ఏదైనా సాధించడమే ముఖ్యం.

అన్నట్టు.. మిమ్మల్ని నా దగ్గరకు రప్పించింది ప్రాంతీయాభిమానమైతే శోచనీయం. మానవత్వం అయితే హర్షణీయం" అని లేచి నుంచున్నాడు వెళ్లడానికి ఉద్యుక్తుడవుతూ.

నావకు చుక్కానిలా నిలిచిన ఆ మహామనీషికి వీడ్కోలు చెబుతూ నమస్కరించాను.

అతను ముందుకు కదిలాడు.

సూర్యుడు పడమటి కొండల మాటుకు వెళ్లిపోయాడు. చీకటి పడింది కానీ సూర్యకిరణాలు ప్రసరించిన సమయంలో చక్కబడిన నా మనసు ఇప్పుడు స్పష్టమై, సవ్యంగా కాంతులీనుతోంది.

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: **ఎడిటర్, ఆదివారం వార్త,** నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

# తెలుగు 'నాటు-నాటు' పాటకు ప్రపంచ పట్టాభిషేకం

## "పొలం గట్టు దుమ్ములోన పోట్లగిత్త దూకినట్టు"

తెలుగు 'నాటు-నాటు'పాట, 2023 నూతన సంవత్సరంలో ప్రపంచ పట్టాభిషేకానికి కీర్తిపతాక ఎగురవేస్తోంది. ఎమ్.ఎమ్.కీరవాణి, ఎస్.ఎస్.రాజమౌళి, చంద్రబోస్ సంగీత, దర్శకత్వ, సాహిత్యంలో, ఎన్.టి.ఆర్, రామ్‌చరణ్ హీరోలుగా ఆర్.ఆర్.ఆర్. చిత్రంలో 'నాటు-నాటు' పాట ప్రపంచ సినీ రంగస్థల ఆకాశంలో ధ్రువతారగా 'కాలభైరవ' 'రాహుల్ సిప్లిగుంజ్', 'ప్రియహిమేష్', 'చంద్రబోస్' ఎంపిక చేసుకొన్న పద సాహిత్యాన్ని 'కీరవాణి' సంగీత దర్శకత్వ సమ్మోహితంగా ప్రాణం అందించగలిగారు. అన్నమయ్య తెలుగు జానపదానికి పుట్టుక యిస్తే, శతాబ్దాల కాలచక్ర పరిభ్రమణం అనంతరం, ఆర్.ఆర్.ఆర్.బృందం, రాజమౌళి, కీరవాణి సారథ్యంలో నాటు-నాటు విశ్వవేదికపై ప్రతిష్ఠించారు. 'నాటు-నాటు' మాటల రిపిటీషన్స్‌తో భారత స్వాతంత్ర్య పోరాటంలో, విప్లవ వీరులుగా స్వతంత్ర భారత జాతికి నిరంతర ఆరాధ్యనీయులుగా, సదా శిరస్సు వంచి ప్రణుతులు అర్పించవలసిన మహోన్నత సమరశీలత్వం, ఈ చిత్రంలో ప్రేక్షకులను రోమాంచితులు చేసే పాటలు, కథనం, సాహసికత్వంతో కథ రూపొందించబడింది. 1920 నాటి బ్రిటిష్ పాలన నాటి ఇతివృత్తంగా సాగిన ఆర్.ఆర్.ఆర్‌లో రామరాజు, భీమ్‌ల సాహస వీరత్వ వ్యక్తీకరణకు ఈ కాంతులీనుతోంది. ఆర్.ఆర్.ఆర్‌లో 3.36 నిమిషాల పొడవు కలిగి ప్రపంచ ప్రేక్షకులను విస్మయపరుస్తున్న 'నాటు' పాటతో చంద్రబోస్, విశ్వవేదికపై తెలుగు జానపద సాహితీ పరిమళాన్ని తన్మయింపచేసారు. ఈ నాటు పాటలో తెలుగు పల్లెసీమల ప్రకృతి సౌందర్యాన్ని చంద్రబోస్ అద్భుతంగా ప్రతిఫలించేసారు. పొలంగట్టు, పోట్లగిత్త, పోలేరమ్మ జాతర, పోతరాజుల నేపథ్యంలో పల్లెహృదయం వీరావేశంతో మాతృభూమి అయిన తల్లినేల కళ్లముందు కదలాడుతుంది.

కె.వి.విజయేంద్రప్రసాద్ కథలో ఈ పాట సన్నివేశం సంపన్న మదాంధులైన బ్రిటిష్ దొరల జల్సా పార్టీ సందర్భంలో, 'ప్రేమ్‌రక్షిత్' కొరియోగ్రఫీతో మన హీరోలు హింస, దోపిడీ, అమానుష బ్రిటిష్ పాలనపై పరోక్షంగా కొరడా ఝుళిపిస్తారు. విచిత్రమేమిటంటే 'కిసుపిట్ట కూసినట్టు', 'ఏలు సిటికెలేసాలా' వీరంగం ధ్వనింపచేసిన ఈ పాట ఒక విదేశీగడ్డపై రాజమౌళి అసామాన్య దర్శక ప్రతిభా చమత్కృతికి ప్రత్యక్ష సాక్ష్యంగా చిత్రీకరించబడింది. అదృష్టవశాత్తు రష్యాదేశం ఉక్రెయిన్‌పై పాశవిక దాడికి కొన్ని నెలల ముందు రోజులలో ఉక్రెయిన్ ప్రెసిడెన్షియల్ ప్యాలస్‌గా పిలుచొనే 'క్వివిలోని మారీన్‌స్కివీ ప్యాలస్‌లో 2021లో ఈ పాట రూపొందింది. చిత్రీకరించబడటం ఒక విశేషాంశం.



కలిపి చిన్నా-పెద్దా యాభై మూడు వాక్య మాటల చరణాలు వున్న ఈ పాట పాప్, వెస్ట్రన్ క్లాసిక్, ఇండియన్ ఫోక్ త్రివేణీ సమ్మిళితంగా 'కీరవాణి' సంగీత మేధా సంపన్నతను ఆస్కార్ నామినేషన్ దిశలో నడిపించింది. ఒక తెలుగు పాటకు ఆస్కార్ స్థాయి ప్రఖ్యాతి లభించడం, కీరవాణి, రాజమౌళి బృందం సాధించిన అపూర్వ విజయం. 1983లో రవిశంకర్, 2009, 2011లో ఎ.ఆర్.రెహ్మాన్, 2013లో బోంబె జయశ్రీల కోవలో అత్యుత్తమ ఒరిజినల్ పాటగా నాటు-నాటు గుర్తింపు పొందడం విజయకేతనం ఎగురవేయడం ఆర్.ఆర్.ఆర్. సాధించిన చారిత్రక సువర్ణ ఘట్టం.

హైదరాబాద్ జెబి స్టూడియోలో రికార్డు అయి జాతీయ, అంతర్జాతీయ కీర్తికిరీటాన్ని అలంకరింపచేసుకొన్న ఈ పాట లహరీ మ్యూజిక్ టి.సిరీస్‌కు ప్రతిష్ఠాత్మక గుర్తింపు యిచ్చింది.

చిత్రంలో, సూపర్ హీరోల హావ, భావ నటనా ప్రతిభ, డైలాగ్‌లతో పాటు ఈ నాటు-నాటు పాట జీవం అందించింది. హిందీ, తమిళం, కన్నడం, మళయాళం భాషలలోకి డబ్బింగ్ అయి ప్రపంచవ్యాప్తంగా, భాషలోని శక్తివంతమైన పదాల అర్థాల భాషాంతరీకరణతో, ధ్వని ప్రధానంగా ఈ పాట ఆకట్టుకొంటోంది. ఈ పాటకు సంగీతపరంగాను, నృత్యపరంగా అపారమైన సాంకేతిక ప్రజ్ఞ, తారాస్థాయి కళా మహోన్నత ప్రదర్శితమైంది. దోస్తీ, జనని, కుమురం భీముడో, రామమ్ రాఘవం, ఎత్తర జెండా, కొమ్మా ఉయ్యాలా.. ఇలా అన్ని పాటలు విశేష అద్భుతాలుగా ఆర్.ఆర్.ని విశేష ప్రతిభా సంపన్నవంతం చేసాయి.

80వ గోల్డన్ గ్లోబ్ అవార్డు, బెస్ట్ ఒరిజినల్ సాంగ్‌గా ఆసియాలో ప్రప్రథమ విజయపతాక గుర్తింపు పొందిన 'నాటు-నాటు' పాట "ఎర్రజొన్న రొట్టెలోన మిరపతొక్కు కలిపినట్టు' 'కిర్రుసెప్పులేసుకొని కర్రసాము 'సేసినట్టు' 'మర్రిసెట్టు నీడలోన కర్రగుంపు కూడినట్టు' పచ్చి మిరపలా, విచ్చుకత్తిలా గుండెలదరింపచేస్తోంది. కాలు, సిందు తొక్కేలా దండనకర మోగినట్లు, ఒకటేమిటి.. నాటు-నాటులో ప్రతిపదం వీరనాటు, ఊరనాటు ప్రతిధ్వనింపచేస్తోంది. తెలుగు సినీ సాహితీ చరిత్రలో 'నాటు-నాటు' చిరస్మరణీయం.

**- జయసూర్య**

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్: 9885446501/9885449458

# మరుగుదొడ్లు ఎటువైపు నిర్మించాలి?

**తూ**ర్పు ఉత్తర గోడలు
తూర్పు ఉత్తర కాంపౌండు గోడలను ఆనుకొని మరుగుదొడ్లు నిర్మించటం ఏమాత్రం మంచిది కాదు. ఈ గోడల మీద మరుగుదొడ్లే కాదు, ఎటువంటి కట్టడాలు వుండకూడదు. అలా కడితే దీర్ఘ అనారోగ్యం, సిరి తరుగుదల వెంటనే కనిపిస్తుంది.

**ఈశాన్య మూల**
ఈశాన్య మూలలో కాంపౌండు గోడలను ఆనుకొని మరుగుదొడ్లు నిర్మించటం ఎటువంటి పరిస్థితుల్లోనూ చేయకూడని పని. ఇలా కట్టడం వల్ల ఈశాన్యమూల మూతపడి వాస్తుదోషం ఏర్పడి ఆ ఇంట్లో నివసించేవారు డిప్రెషన్‌కి గురవుతారు. ఆ స్థానం ఈశ్వరుడి స్థానం, పరమ పవిత్రమైంది. పూజలందించవలసిన స్థానంలో మరుగుదొడ్డి నిర్మించటం ఎంత ఘోరమో వేరే చెప్పనవసరం లేదు. చేతికందిన ముద్ద నోటికి చేరేలోపల జారి మట్టి పాలవటం లాంటి అనుభవాలు ఎదురవుతుంటాయి. తద్వారా జీవితం మీద విరక్తి కలగటం మొదలయిన ఘోర విపత్తులు సంభవిస్తాయి.

సర్వ భోగాలతో ఒక వెలుగు వెలిగిన భాగ్యవంతుల ఇండ్లు ఇప్పుడు శిథిలాలయాలుగా మారి, వందల్లో, వేలల్లో వున్న ఎకరాలు హారతి కర్పూరంలా హారించుకుపోయి అప్పుల పాలయినవాళ్ల రెండో తరం, మూడో తరం సంతతిని చూస్తే మనసు కెలికేసినట్టవుతుంది. వాళ్ల ఇల్లు కూడా చూడకుండా వాళ్ల ఇంట్లో మరుగుదొడ్లు వున్న స్థలాలేమిటో చెప్పవచ్చు. డబ్బు వున్నప్పుడు మిడిసిపడి 'వాస్తు'ను నిర్లక్ష్యం చేసి ఈశాన్యంలోనూ, తూర్పు ఉత్తర గోడలనానుకునో మరుగుదొడ్లు కట్టి సిరి హారించుకుపోతున్న దశలో ఆ కట్టినవాళ్లు చెడు ఫలితాలు అనుభవించాల్సి వస్తుంది. ఆ దోషం మాత్రం అలాగే వుండిపోతుంది. వాళ్ల తర్వాత తరాలవాళ్లు దానికి బలయిపోయారు. కారణం తెలిసేలోపల పరిస్థితి చేయి జారిపోతుంది. "ఒక చిన్న సవరణ, ఇల్లు కట్టేటప్పుడు ఒక చిన్న జాగ్రత్త తీసుకుంటే తరం మారినా కాలం కలిసి వస్తుందని ఎందుకు ఆలోచించరు" అనిపిస్తుంది.

వాస్తుకు, ధనానికి, ఆరోగ్యానికి సంబంధం వుంది. వాస్తు పరంగా వున్న ఇంట్లో ధనం ఉంటుంది. ఆ ఇంటిల్లిపాదీ ఆరోగ్యంగా వుంటారు. ధనం, ఆరోగ్యం వున్నవాళ్ల ఆలోచనా సరళి జనామోదయోగ్యంగా వుంటుంది (ఆరోగ్యం శారీరకమయిందే కాక మానసికమైనది కూడా)



**ఆగ్నేయ మూల**
ఆగ్నేయ మూలలో మరుగుదొడ్లు నిర్మించవలసి వస్తే తూర్పుగోడను ఆనుకొనకుండా దక్షిణ గోడను ఆనుకొని లేదా ఆనుకోకుండా వేసుకోవచ్చు.

దక్షిణ గోడను నైరుతి నుండి ఆగ్నేయ మూల వరకు కొలిచి తొమ్మిది సమ భాగాలు చేసి ఆగ్నేయ మూల నుండి రెండు సమభాగాలు వదిలేసి దక్షిణ గోడను ఆనుకొని లేదా ఆనుకొనకుండా మరుగుదొడ్డిని నిర్మించటం శ్రేష్ఠం. అలా వీలుకాని పక్షంలో ఆగ్నేయ మూల నుండి తూర్పుకు కనీసం మూడు అడుగుల స్థలాన్ని వదిలేసి, దక్షిణ గోడను ఆనుకొని లేదా ఆనుకొనకుండా నిర్మించుకోవచ్చు.

అయితే మరుగుదొడ్డి యింటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తాకకూడదు. మరుగుదొడ్డికీ యింటికీ మధ్య కనీసం ఒక మనిషి నడిచే స్థలాన్ని ఖాళీగా వదిలేయాలి. ఏ మూలలో కట్టే మరుగుదొడ్డికైనా రేకులు తూర్పు, ఉత్తరాలకు మాత్రం వాలు వచ్చేలా జాగ్రత్త పడాలి. రేకులు కాక స్లాబు వేస్తే వర్షంనీరు స్లాబు పైనుండి ఈశాన్య మూలకు జారేలా స్లాబుని ఒకటి రెండు అంగుళాలు వాలు చేస్తే చాలు.

ఆగ్నేయపు మరుగుదొడ్డిలో ఉత్తర ముఖంగా కూర్చునే వీలుంటుంది. అలా కూర్చోవచ్చు. దొడ్డి పెద్దదిగా వున్నప్పుడు దక్షిణ ముఖంగా కూర్చునే విధంగా లెట్రిన్ పాట్ అమర్చగలిగితే మంచిది. ఉత్తర ఈశాన్యపు గేటు వున్నప్పుడు ఆగ్నేయంలో మరుగుదొడ్డి మంచి ఫలితాలను యివ్వకపోవచ్చు.

తూర్పు గోడను ఆనుకొని మరుగుదొడ్డిని నిర్మించటం దారిద్ర్యాన్ని పిలుచుకోవటం లాంటిది.

సెప్టిక్ ట్యాంక్ లెట్రిన్‌ని ఆగ్నేయంలో నిర్మించవలసి వస్తే లెట్రిన్ ఆగ్నేయంలో కట్టిన సెప్టిక్ ట్యాంక్‌ని మాత్రం తూర్పు లేదా ఉత్తరం గోడలకు మధ్య స్థలంలో తవ్వాలి. మరుగుదొడ్డి నుండి పైప్‌లైన్ ఆ ట్యాంక్‌కు యివ్వాలి.

ఆగ్నేయంలో 'సెప్టిక్ ట్యాంక్' కట్టటం అంతులేని ఖర్చుకు, అనారోగ్యానికి గుర్తు అని గమనించండి. ❑





# తొలి విద్యాకేంద్రం

# నలంద విశ్వవిద్యాలయం

షేక్ అబ్దుల్ వాకీం జాని

ఒకప్పుడు సరస్వతీ నిలయంగా భాసిల్లిన బౌద్ధుల విద్యాకేంద్రం ప్రాచీన నలంద విశ్వవిద్యాలయం. బీహార్ రాజధాని పాట్నాకు తొంభై కి.మీ. దూరంలో నలంద నెలకొని ఉంది. నలంద అంటే సంస్కృతంలో జ్ఞానాన్ని ప్రసాదించేది అని అర్థం. నలం అంటే కలువపూవు అని అర్థం కూడా ఉంది. కమలం జ్ఞానానికి చిహ్నం. రాజగిరిని చూడటానికి వచ్చిన పర్యాటకులు అక్కడి నుండి పదమూడు కి.మీ. దూరంలో ఉన్న నలందను సందర్శిస్తారు.

రాజగిరి రాజధానిగా వెలుగొందిన కాలంలో నలంద దాని ఉప నగరంగా పేరు తెచ్చుకుంది. నేటికీ భారతదేశం సగర్వంగా చెప్పుకునే విశ్వవిద్యాలయం నలంద. ఆ కాలంలో వెలసిన నలంద, తక్షశిల, విక్రమశిల ముఖ్యమైన విశ్వవిద్యాలయాలు. వీటిలో నలంద అతిముఖ్యమైనది. నివాస సౌకర్యంతో విద్యాభ్యాసం చేయడానికి అనువైన ఈ పురాతన విశ్వవిద్యాలయం ఆ కాలంలో కొన్ని వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేయడానికి అనుకూలంగా ఉండేది. యునెస్కోవారు నలందను ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించారు.

జ్ఞానాన్ని ఇచ్చే భూమి నలంద ప్రపంచంలోనే తొలి ఆవాస ప్రాచీన విశ్వవిద్యాలయం. అంటే ఇక్కడ వసతి గృహాలలో విద్యార్థులు నివాసముండి విద్యను ఆర్జించేవారు. జ్ఞాన సముపార్జన కోసం విద్యార్థులు సుదూర ప్రాంతాల నుండి ఇక్కడికి వచ్చేవారు. ఆ కాలంలో 10 వేల మంది విద్యార్థులకు ఆచార్య నాగార్జున, అశ్వఘోష, వసుబంధ, కమలశీల, సంఘభద్ర, శాంత రక్షిత, వీరదేవ, మంజుశ్రీ దేవ.. ఇత్యాది రెండు వేల మంది ఆచార్యులు ఇక్కడ విద్యాబోధన చేసినట్లు తెలుస్తోంది. ఈ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేయడం కోసం చోటు దొరకడం గొప్ప విషయంగా భావించేవారు. తర్క, వైద్యం, గణితం, తత్వం, వ్యాకరణం.. మొదలైన వందకు పైగా అంశాలలో విద్యార్థులకు విద్యాబోధన చేసేవారు. క్రీ.పూ.500 సంవత్సరంలో గౌతమ బుద్ధుడు అనేక పర్యాయాలు నలందతో పాటు దాని చుట్టుపక్కల గ్రామాలను సందర్శించినట్లు చరిత్ర చెబుతోంది.

గౌతమబుద్ధుడు మగధ గుండా తన చివరి యాత్రలో నలందను సందర్శించినట్లు చారిత్రక ఆధారాల వల్ల తెలుస్తోంది. సువిశాలమైన నలంద విశ్వవిద్యాలయానికి అశోక చక్రవర్తి క్రీస్తు పూర్వమే పునాదులు వేశాడనేది చరిత్ర చెబుతోంది. గుప్తుల కాలంలో ఇది విశ్వవిద్యాలయంగా రూపు దాల్చింది. మొదటి కుమారగుప్తుడి పాలనా కాలమైన క్రీ.శ.413లో నలంద పూర్తి స్థాయి విశ్వవిద్యాలయంగా రూపుదిద్దుకొని 750 సంవత్సరాల పాటు అనేక వంశాల రాజుల కాలంలో ఇక్కడ విద్యాబోధన సాగింది. ముఖ్యంగా క్రీ.శ.427 నుండి క్రీ.శ.1197 వరకు బౌద్ధ విజ్ఞాన కేంద్రంగా విరాజిల్లింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన చైనా యాత్రికుడు హ్యుయాన్‌త్సాంగ్ రెండుసార్లు నలంద విశ్వవిద్యాలయాన్ని సందర్శించడమే కాకుండా రెండేళ్ల పాటు ఇక్కడే ఉండి అనేక అంశాలలో శిక్షణ పొంది ఈ విశ్వవిద్యాలయం నుండి అనేక గ్రంథాలను చైనాకు తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. ఆ తరువాత ఈ గ్రంథాలను వారి భాషలోకి అనువదించి అనేక మందికి వీటిని అందుబాటులోకి తెచ్చినట్లు సమాచారం. ఆ తరువాత నలంద బౌద్ధ విహార విద్యాకేంద్రంగా మార్పు చెందడం మొదలైంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి విద్యార్థులు నలందకు రాసాగారు. క్రమంగా ఇది విశ్వవిద్యాలయ స్థాయికి ఎదిగింది. గుప్త రాజులు నలందను సరస్వతీ నిలయంగా తీర్చిదిద్దారు.





నలంద విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేయడం సామాన్య విషయం కాదు. విద్యార్థులకు ప్రవేశ పరీక్ష పెట్టేవారు. నూటికి పది మంది మాత్రమే ఆ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేవారు. ఇక్కడ ప్రవేశార్హత పొందితే వసతి, దుస్తులు, భోజన, ఆరోగ్యం మొదలైన సకల సదుపాయాలు ఉచితంగా కల్పిస్తారు. నాటి చక్రవర్తులు ఈ సదుపాయాలు సమకూర్చడానికై తమ కోశాగారం నుండి పుష్కలంగా ధనాన్ని పంపేవారు.

నలంద విశ్వవిద్యాలయం పేరు దేశ విదేశాల వరకు వ్యాపించింది. చైనా, టిబెట్, శ్రీలంక, మంగోలియా, థాయ్‌లాండ్ మొదలైన ప్రాంతాల నుండి విద్యార్థులు నలందకు వచ్చేవారు. హర్షవర్ధన చక్రవర్తి కాలంలో కన్యాకుబ్జాన్ని చైనా యాత్రికుడు హ్యుయాన్‌త్సాంగ్ సందర్శించాడు. ఆయన క్రీ.శ.673లో నలందను దర్శించి ఈ విశ్వవిద్యాలయానికి అపారమైన ఆర్థిక వనరులున్నాయని తన గ్రంథంలో వివరించారు. నలంద విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పని చేసిన వారిలో నాగార్జునాచార్యుడు, దిఙ్నాగుడు, ధర్మకీర్తి, ఆర్యదేవుడు, కమలశీలుడు, పద్మసంభవుడు, దీపంకరుడు, శీలబద్ధుడు మొదలైనవారు ముఖ్యులు. తొలుత బౌద్ధమతానికి పరిమితమైన నలందలో కొన్నేళ్ల తరువాత ఆర్ష ధర్మానికి చెందిన అంశాలు చోటు చేసుకున్నాయి. తర్కం, ఆయుర్వేదం, వేదాధ్యయనం, వ్యాకరణం మొదలైన విభాగాలు శాఖోపశాఖలుగా విస్తరించాయి.



12వ శతాబ్దం వరకు పచ్చగా ఉన్న ఈ సరస్వతీ పీఠం ఆ తరువాత జరిగిన కొన్ని దండయాత్రల్లో ధ్వంసమైంది. శిథిలావస్థలో ఉన్న నలందను ఒక ఆంగ్లేయుడు 19వ శతాబ్దంలో కనుగొన్నాడు. 19వ శతాబ్దం పూర్వార్థంలో బుచ్చౌన్ హామిల్టన్ అనే ఆంగ్లేయుడు బారాగావ్ ప్రాంతంలో కొన్ని బౌద్ధ, హైందవ ప్రతిమల్ని కనుగొన్నాడు. ఆ తరువాత 19వ శతాబ్దం ఉత్తరార్థంలో అలెగ్జాండర్ కన్నింగ్ హామ్ అనే చరిత్రకారుడు చారిత్రక ఆధారంతో నలంద గురించి ప్రకటించారు.

1915-1916 మధ్య కాలంలో భారత పురాతత్వ శాఖ ఇక్కడ తవ్వకాలు జరిపి, ఇప్పుడు దర్శనమిస్తున్న శిథిలాలను వెలికితీశారు. బౌద్ధ గురువైన నరీపుత్రుడు ఇక్కడ జన్మించడం వల్ల దీనికి నలంద అని పేరు వచ్చినట్లు గాథలు ప్రచారంలో ఉన్నాయి. ఇక్కడి ప్రాంతీయ భాషలో కలువపూలను "నాల" అంటారు. ఈ పట్నంలో కలువపూలు అధికంగా ఉండటం వల్ల దీనికి "నాలంద" అనే పేరు వచ్చినట్లు ఇంకో గాథ ప్రచారంలో వుంది. నలంద తవ్వకాల్లో బయల్పడిన అనేక వస్తువులను సంగ్రహాలయంలో భద్రపరిచారు. మట్టితో, రకరకాల లోహాలతో తయారు చేసిన నాణేలు, శాస్త్రాధ్యయనం కోసం ఉపకరించిన వస్తువులు, ఫలకాలు.. ఇంకా అనేక అరుదైన వస్తువులు ఈ సంగ్రహాలయంలో ఉన్నాయి. కాలగతిన శిథిలమై బయల్పడిన అనేక శిథిల నిర్మాణాలు చూపరుల్ని దిగ్భ్రాంతి పరుస్తాయి. విద్యార్థులకు విద్య బోధించే కక్ష్యలు, వాటి చుట్టూ వుండే గదుల తాలూకు శిథిలాలు నాటి వాస్తు నిర్మాణ కౌశలానికి మచ్చుతునకగా చెప్పవచ్చు. ఆచార్యులవారి పీఠం, మంచినీటి బావి నాటి వైభవానికి ప్రతీకలుగా కానవస్తాయి. నలంద విశ్వవిద్యాలయం ఐదంతస్తులతో అలరారుతుండేది. ఈ విశ్వవిద్యాలయం వాస్తుకళకు సంబంధించిన ఒక మచ్చుతునకగా భావించబడుతోంది.

నలందలో అనేక ధ్యాన మందిరాలు, తరగతి గదులతో పాటు ఎనిమిది ప్రత్యేకమైన ప్రాంగణాలు, ఆలయాలు ఉండేవి. ప్రాంగణంలోపల చెరువులు, ఉద్యానవనాలు కూడా నెలకొని ఉండేవి. నేటికీ తన ఆకృతిని కోల్పోకుండా కనిపిస్తున్న ముఖ్య స్థూపాన్ని దాదాపు ఏడు సార్లు పునర్నిర్మించినట్లు తెలుస్తోంది. ఇవి చతురస్రాకార నిర్మిత స్తూప సముదాయాలు. వీటికి ఉత్తరం వైపు మెట్లు ఉన్నాయి. కుడి వైపు ఆలయాలున్నాయి. వాటికెదురుగా వున్న నాటి చిత్రలేఖనా ప్రదర్శనాశాలల శిథిలాలు కానవస్తాయి. ఇక్కడ బయల్పడిన గోడలు ఆరు నుండి 12 అడుగుల మందం ఉన్నాయి. ఇంత వెడల్పయిన గోడతో నిర్మితమైన ఆ భవన సముదాయం ఎంత పటిష్టమైనదో మనం ఊహించవచ్చు. శిథిలాల్లో మొత్తం పదమూడు విభాగాలు బయటపడినాయి. వాటికెదురుగా ఎనిమిది సభామండపాలు ఉన్నాయి.



అన్ని విభాగాలలోను మొత్తం 300 తరగతులు ఉండేవి. యావత్ ప్రపంచం గర్వించదగిన గ్రంథాలయం నలందాలో ఉండేదని తెలుస్తోంది. ఖగోళ శాస్త్రం, చరిత్ర, భాషాశాస్త్రం, సాహిత్యం.. ఇలా అనేక రకాల అరుదైన తాళపత్ర గ్రంథాలతో ఇక్కడ అతి పెద్ద గ్రంథాలయం కూడా ఉండేదని చరిత్ర చెబుతోంది.

విదేశీయులు చేసిన దండయాత్రలలో నలంద ధ్వంసమవడమే కాకుండా ఇక్కడి గ్రంథాలయంలోని వేలాది గ్రంథాలు అగ్నికి ఆహుతి అయ్యాయని చరిత్ర చెబుతోంది. ఇంతటి మహోజ్వల చరిత్ర కలిగిన నలంద శిథిలాలను తిలకించి కంట తడిపెట్టని కళాహృదయం ఉండదంటే అతిశయోక్తి కాదు.

నలందలో జీర్ణావస్థలో ఉన్న అనేక కట్టడాలు కనిపిస్తాయి.

ఒకప్పుడు ఈ ప్రాంతంలో జనావాసాలు ఉండేవి కావు. ఇప్పుడు నలంద సమీపంలో బారాగావ్ అనే గ్రామం ఉంది. అలెగ్జాండర్ కన్నింగ్‌హాం నలందను బారాగావ్ గ్రామంగా గుర్తించారు. 1951లో నలంద సమీపంలో నవ నలంద విహారం పేరుతో థేరావాద బౌద్ధ అధ్యయన కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఈ కేంద్రం శాటిలైట్ల ద్వారా ఈ ప్రాంతాన్ని అధ్యయనం చేయడానికి ప్రయత్నిస్తోంది. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియావారు ఇక్కడ చేసిన తవ్వకాల ద్వారా అలనాటి అనేక విశేషాలు, అవశేషాలు బయల్పడినాయి. క్రీ.శ.600 సంవత్సర కాలం నాటి వస్తువులు కూడా ఇక్కడ బయల్పడినట్లు తెలుస్తుంది. ఇలా లభించిన వస్తువులను నలంద మ్యూజియంలో పర్యాటకుల సందర్శనార్థం భద్రపరిచారు. 2006 డిసెంబరు 9న న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఒక బిలియన్ డాలర్ల ఖర్చుతో ప్రాచీన విశ్వవిద్యాలయం ఉన్న ప్రాంతంలోనే పునరుద్ధరించడానికి చేస్తున్న ప్రయత్నానికి సంబంధించిన ప్రణాళికలపై చక్కటి వ్యాసం ప్రచురించింది.

సింగపూర్ నేతృత్వంలో భారత్-జపాన్‌తో పాటు మరికొన్ని దేశాలు కలిసి



500 మిలియన్ డాలర్లతో నూతన విశ్వవిద్యాలయాన్ని నిర్మించడంతో పాటు, మరో 500 మిలియన్ల డాలర్లతో దానికయ్యే సంపూర్ణ వనరులు, వసతులు అభివృద్ధి చేసే నిమిత్తం నిధులు సేకరించే ప్రయత్నం చేశారు. 2006లో భారతరత్న డాక్టర్ ఏ.పీ.జె.అబ్దుల్ కలాం ఈ విశ్వవిద్యాలయాన్ని తిరిగి నిర్మించాలని సూచించారు. వారి సూచన మేరకు కేంద్ర ప్రభుత్వం పునర్నిర్మించేందుకు పూనుకుంది. ఈ ప్రయత్నంలో భాగంగా భారతదేశంలో అతిప్రాచీనమైన నలంద విశ్వవిద్యాలయం 2014 సెప్టెంబరు 1న తిరిగి ప్రారంభమైంది. దాదాపు 800 సంవత్సరాల తరువాత ఈ విశ్వవిద్యాలయంలో తరగతులు ప్రారంభం కావడం విశేషం. బీహార్ రాజధాని పాట్నాకు తొంభై కిలోమీటర్ల దూరంలో రాజ్‌గిర్ వద్ద ఈ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం కొన్ని కోర్సులతో మాత్రమే నలంద విశ్వవిద్యాలయం కొనసాగుతోంది.







# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం

విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తాయి. చిరు వ్యాపారులకు పోటీ ఎదురైనా ఎవరి లాభాలు వారికి ఉంటాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. బ్యాంకు రుణాలు మంజూరవుతాయి. వృత్తి విద్యా కోర్సుల్లో చేరతారు. వివాహాది శుభ కార్యాలకు హాజరవుతారు. దంపతుల మధ్య స్వల్ప మనస్పర్థలకు అవకాశం. నూతన వాహన యోగం.

## వృషభం

ఉత్సాహంగా గడుస్తుంది. సాహిత్య సభలు, సమావేశాలకు హాజరవుతారు. ఊహించని వార్తలు వింటారు. ఉద్యోగులకు పదోన్నతి/స్థాన చలన సూచనలున్నాయి. సాహితీ మిత్రులను కలుసుకుంటారు. నూతన వ్యక్తులతో పరిచయం. వృథా ఖర్చులను నియంత్రించడం అత్యవసరం. వ్యాపారులకు అనుకోని చోట్ల స్వల్ప నష్ట సూచనలున్నాయి.

## మిథునం

ధర్మ రక్షణకై పాటుపడతారు. ఆకస్మిక సంఘటనలు జరుగుతాయి. సంయమనం పాటించండి. శత్రువులు మిత్రులవుతారు. ఉద్యోగాభివృద్ధి ఆశించిన విధంగా ఉండకపోవచ్చు. విశేష వస్తువులు సమకూర్చుకుంటారు. విదేశాల్లో వున్న ఆత్మీయుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు. వృత్తి విద్యా కోర్సులు అభ్యసించిన వారికి బాగుంటుంది.

## కర్కాటం

సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. శుభ కార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. అకారణంగా ఆందోళనకు లోనవుతారు. సొంతింటి స్వప్నం ఫలించే యోగం. తీర్థ యాత్రలు చేస్తారు. అనాథలకు ఆశ్రయం కల్పిస్తారు. ప్రతికూలతలు ఎదురైనా ప్రారంభించిన పనులు పూర్తి చేస్తారు. సోదరుల మధ్య ఐకమత్యం లోపిస్తుంది.

## సింహం

భూ తగాదాలు తీవ్రమవుతాయి. సామరస్యంతో సమస్యలు పరిష్కరించుకోవడం ఉత్తమం. విద్యార్థులకు పోటీ పరీక్షల్లో విజయం లభిస్తుంది. శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. చోర భయం పొంచి వుంది. చిరు వ్యాపారులకు పోటీ ఎదురైనా ఎవరి లాభాలు వారికి ఉంటాయి. ఆరోగ్య సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించండి.

## కన్య

సన్నిహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు. పెట్టుబడులను వాయిదా వేయడం మంచిది. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. బ్యాంకు రుణాలు తీర్చడంలో ఇబ్బందులుంటాయి. చోర భయం పొంచి వుంది కనుక విలువైన పత్రాలు, వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండండి.

## తుల

అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరిస్తారు. సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. వృథా ఖర్చులను నియంత్రించాలన్న ప్రయత్నం ఫలించదు. కుటుంబంలో మనస్పర్థలుంటాయి. కళాకారులకు ప్రముఖుల ప్రశంసలు లభిస్తాయి. శత్రువులు మిత్రులవుతారు. తీర్థ యాత్రలు చేయాలన్న ఆలోచనలో ఫలిస్తుంది. ఆరోగ్య సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించండి. నూతన గృహం కొనుగోలు.

## వృశ్చికం

ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. సామాన్య ధన లాభాలుంటాయి. వివాదాల జోలికి వెళ్లకపోవడం ఉత్తమం. భాగస్వామ్య వ్యాపారులకు బాగుంటుంది. దంపతుల మధ్య స్వల్ప మనస్పర్థలుంటాయి. అన్ని విషయాల్లో ఆచి తూచి వ్యవహరించడం చెప్పదగిన సూచన. మీ మంచితనమే మీకు శ్రీరామరక్ష. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఎదురు చూస్తున్న సమాచారం అందుతుంది.

## ధనుస్సు

స్త్రీలకు శుభ యోగం. కుటుంబంలో ఐకమత్యం ఏర్పడుతుంది. దుష్ట సాంగత్యం మంచిది కాదని స్వానుభవంతో తెలుసుకుంటారు. ఉద్యోగులకు పనివత్తిడి ఉంటుంది. అనూహ్యంగా మొండి బకాయిలు వసూలవుతాయి. చిన్ననాటి మిత్రులకు సహాయ సహకారాలు అందిస్తారు. వ్యవసాయదారులకు ప్రోత్సాహం లభిస్తుంది. అన్ని వ్యవహారాల్లో మీదే విజయం. క్రయ-విక్రయాలు యథాతథంగా ఉంటాయి.

## మకరం

క్రీడాకారులకు, కళాకారులకు సన్మాన యోగం. భూ తగాదాలు తీరి ప్రశాంతత లభిస్తుంది. శత్రువులు మిత్రులవుతారు. సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు ఫలించే సూచనలున్నాయి. సహనంతో ఉండండి. చిరు వ్యాపారులకు బ్యాంకు రుణాలు లభిస్తాయి. వృథా కాలక్షేపం చేయడం ఏమాత్రం సమంచితం కాదు. మీ శక్తి సామర్థ్యాలకు గుర్తింపు లభిస్తుంది. అన్ని రంగాల్లోనివారు ఎంతో కొంత లాభపడతారు.

## కుంభం

దేశాంతర ప్రయాణ సూచనలున్నాయి. వ్యవసాయ భూమి కొనుగోలు చేసే సూచనలున్నాయి. కుటుంబంలో ఐకమత్యం ఏర్పడుతుంది. విశేష వస్తువులు సమకూర్చుకుంటారు. శత్రువులు మిత్రులవుతారు. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. వివాదాలకు దూరంగా ఉండడం మంచిది. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి చెప్పుకోదగిన ఫలితాలు ఉంటాయి.

## మీనం

విలాసవంతమైన జీవితం పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. గృహ రుణాలు మంజూరవుతాయి. వృత్తి విద్యాకోర్సుల్లో చేరతారు. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. ప్రయాణాల్లో విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండండి. దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని నిశ్చయించుకుంటారు. సామాజిక సంఘర్షణకు లోనవుతారు. సహోద్యోగులతో సాన్నిహిత్యం ఏర్పడుతుంది. పెట్టుబడులు లాభిస్తాయి.

# విద్యార్థుల జీవితంలో గురువుపాత్ర

**మనిషి జీవితంలో గురువుపాత్ర అమోఘం. నేటి కాలంలో పిల్లలు ఎక్కువ సమయం బడిలోనే ఉంటున్నారు. అనుక్షణం ప్రతి టీచర్ కదలిక, మాట, పాఠం చెప్పే తీరుని ప్రతి విద్యార్థి గమనిస్తూ అనుకరిస్తాడు. కుల, మత, జాతి, ప్రాంత, వివక్షతను చూపకుండా తన కన్నబిడ్డలుగా భావిస్తే ఆ విద్యార్థి తప్పనిసరిగా గురువులను జీవితాంతం గుర్తుంచుకుంటాడు.**

రాక్షస గురువు శుక్రాచార్యుడు మంచి గురువు అని బృహస్పతి మెచ్చుకున్నాడు. కచుణ్ణి అతని వద్దకు పంపాడు.

శుక్రాచార్యుడు కచునికి సకల విద్యలు బోధించాడు.

త్యాగరాజు తన కీర్తనలో "గురువు ఎటువంటి గుణికి తెలియకపోదు" అని గురువు చిల్లగింజ భ్రమరము పరసువేది అని ప్రస్తుతించారు.

ఆదిశంకరాచార్యులవారు పద్మపాదునిపై చూపిన ప్రేమ తెలిసిందే! నడిచే దైవం కంచి పరమాచార్య అన్నారు "రోజూ ఒక ఐదు నిమిషాలు నా కోసం కేటాయించి దైవ స్మరణ చేయండి" అని. అదీ గురువు మాటకున్న మహిమ! రామకృష్ణ పరమహంస దృఢంగా "అవును స్పష్టంగా దేవుని నా కళ్లారా చూశాను" అనగానే- నరేంద్రుడు శిష్యుడు స్వామి వివేకానందగా భాసించాడు. సాక్షాత్తు భగవదావతారాలైన రాముడు, కృష్ణుడు గురుకులంలో ఎంత భక్తి వినయాలతో విద్య అభ్యసించారో మనకి తెలుసు.

ద్రోణుడు తన కన్నకొడుకు కన్నా మిన్నగా అర్జునుడిని తీర్చిదిద్దాడు.

"నిన్ను నీలో చూసుకో! మౌనంగా ఉండు" అన్న రమణ మహర్షి ఆదర్శ గురువు. గురువు అపాత్రదానం చేయరాదు. కంచి, శృంగేరి పీఠాధిపతులు ఎంతో శోధించి మథించి తమ అంతేవాసులలో ఒకరిని చిన్న స్వామిగా దీక్ష ఇస్తారు. గురువు వజ్రంని బాగా చెక్కి మెరిసేలా చేస్తాడు.

ప్రకృతి నిత్య సత్య గురువు. త్వరగా నిద్ర లేచే మంచి అలవాటు కోడి నేర్పుతుంది. విశ్వాసంగా ఉండు అని శునకం నుంచి గ్రహించాలి. భరద్వాజపక్షి గుడ్డులోంచి బైటికి వచ్చాక నేలపై కాలు మోపదు తన జీవితాంతం వరకు. కొమ్మపై లేదా ఎగరటం దాని ప్రవృత్తి. అలాగే గురువు ధర్మం, నీతి, న్యాయం అనే విషయాన్ని పదే పదే చెప్తూనే ఉండాలి. పాలు, నీరు వేరు చేసి హంస గురువు.



పాజిటివ్ సకారాత్మక భావాల్ని పిల్లల్లో నాటుతూ ఉండాలి. సమర్థ రామదాసు ఛత్రపతి శివాజీలో దేశభక్తి, దైవభక్తి నాటాడు. ప్రతి పండగ అంతరార్థం మన భారతీయ సంస్కృతి-సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబొట్టుల గురించి ప్రతి టీచర్ ఒకటి, రెండు నిమిషాలు చెప్పి పాఠం మొదలు పెట్టడం మంచిది. ప్రతి శనివారం పూర్తి పీరియడ్ మోరల్ సైన్స్‌కి వినియోగించాలి.

అబ్దుల్ కలాం జీవితంలో ఆయన్ని ప్రభావితం చేసిన మాష్టార్లు ఎందరో! చిన్నారి కలాంని రామేశ్వరంలో సైన్స్ మేష్టారు శివసుబ్రహ్మణ్య అయ్యర్. వంటింట్లో మడి కట్టుకున్న భార్య వడ్డిస్తూ వుంటే ఆప్యాయంగా ఆ పిల్లాడితో పాటు ఆయన భోజనం చేసేవారు. తన 15వ ఏట ఇయదురైసొలమాన్ మార్గదర్శి అని రాశారు కలాం.

గణితంమాష్టారు చిన్న తప్పుకి బెత్తంతో కొట్టి, ఆ తర్వాత ప్రేయర్‌లో "కలాం మన బడికి కీర్తి తెస్తాడు" అని అభినందించారు. సెయింట్ జోసెఫ్ కాలేజీ అధ్యాపకులు వేరే మతస్థులైనా కంచి పరమాచార్య అనుచరులు.

ఇక "పిల్లలు ఆదర్శంగా ఉండాలి" అనేముందు అధ్యాపకులు ఆదర్శంగా నడవాలి. బడికి, క్లాస్‌కి ఠంచన్‌గా రావాలి. రెండు నిమిషాలు పిల్లల చేత చెవులు పట్టుకుని గుంజీలు తీయిస్తే మెదడు చురుగ్గా ఉంటుంది. తను కూడా చేయాలి. పిల్లల చేత పాఠంలోని ముఖ్యాంశాలు చదివించి చెప్పించాలి. పరీక్షపేపర్లు, నోట్సు శ్రద్ధగా తప్పులు సరిచేసి వివరించాలి. క్లాస్‌లో డల్‌గా ఉండేవారిపై దృష్టి పెట్టాలి. వారిని పిలిపించి కారణం కనుక్కోవాలి. ప్రతి శనివారం మోరల్ సైన్సు క్లాసులో కథలు, పుస్తకాలు చదివించి వారి చేత చెప్పించాలి. ఆదర్శంగా గురువు తన మాట నడత చేతలో ఉంటే పిల్లలు తప్పక గురువులను ఆదరించి ప్రేమిస్తారు. జీవితాంతం గుర్తు పెట్టుకుంటారు. అందుకే గురువు కలకాలం గుండెలో వెలిగే దీపం.

**- అచ్యుతుని రాజశ్రీ**

సింగిల్ పేజీ కథ

# నిజాయితీ విలువ

గొర్రెపాటి శ్రీను

సమయం రాత్రి పది గంటలు. హైదరాబాద్ నుండి బస్సులో వచ్చిన జనార్ధన రావు క్లాక్ సెంటర్‌లో దిగి ఆటో ఎక్కి చైతన్యపురి కాలనీ వెళ్లాలనుకున్నాడు. ఎనిమిది దాటితే ఆర్టీసీ బస్‌లు అటుగా వెళ్లడానికి వుండవు. ఇంత రాత్రివేళ ఆటోలే వుంటాయి. "చైతన్యపురి కాలనీ వస్తావా?" "ఆ వస్తాను సార్?" "ఎంత?" "నూట యాభై రూపాయలు సార్" "అదేంటి? నూటా ఇరవయ్యే కదా?" సందేహంగా అడిగాడు జనార్ధన్ రావు. "సార్, పగలైతే వందకు కూడా వస్తాం. కానీ ఇంత రాత్రివేళ తిరిగి ఇటుగా రావాలంటే బేరాలు దొరకవు. అందుకే.." నసిగాడు ఆటో డ్రైవర్.

ఏదో ఆలోచిస్తున్నట్లుగా కాస్త ముందుకు నడిచాడు జనార్ధన్ రావు.

మరో ఆటోవాడు అతడి దగ్గరకు వచ్చి "సార్! ఆటో గావాల్నా?" అడిగాడు.

"చైతన్యపురి కాలనీ వస్తావా?" "వస్తా, రెండొందలు" అన్నాడు ఠకీమని. "ఆ..?" "ఇది అయ్యే బేరం కాదనుకుంటూ తనలో తనే గొణుక్కుంటూ వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత తన దగ్గరకు వచ్చి ఆటోవాడి వైపు చూస్తూ "నువ్వడిగినట్లు నూట యాభై ఇస్తానులే, పద వెళ్దాం" అన్నాడు. రోడ్ నిర్మానుష్యంగా ఉండడంతో ఆటో స్పీడ్‌గా డ్రైవ్ చేస్తున్నాడు ఆటో డ్రైవర్ నాగయ్య.

"ఏడుంటవ్?" ఆటో డ్రైవర్‌ని అడిగాడు జనార్ధన్ రావు. "బోయగూడలో వుంటా సారు"

"అట్లనా! మా కాలనీల రోడ్లు కొత్తగా వేస్తున్నారు. అక్కడికి వెళ్లినంక కాస్త నిమ్మలంగా ఆటో పోనియ్.. సరేనా?"

"సరే సారు!" చైతన్యపురి కాలనీలో జనార్ధన్‌రావుని దించి తిరుగు ముఖం పట్టాడు నాగయ్య. కాస్త దూరం వచ్చి దగ్గరలో ఉన్న పెట్రోల్ బంక్ దగ్గర ఆగాడు పెట్రోల్ కోసమని నాగయ్య.

" పెద్దాయన పర్సు మర్చిపోయినట్లున్నాడు" అనుకుంటూ పెట్రోల్ కొట్టించుకుని చైతన్యపురి వైపు ఆటో తిప్పాడు నాగయ్య. ఇంటి బయట ఆందోళనగా పచార్లు చేస్తున్న జనార్ధనరావు ఆటో శబ్దం విని గబగబా ఆటో దగ్గరకు వచ్చాడు. అప్పటికే ఒళ్లంతా చెమటలు పట్టిన అతనికి ఎదురుగా నిలబడిన నాగయ్యను చూసేసరికి ఒక్కసారిగా ప్రాణం లేచి వచ్చినట్లుగా అనిపించింది. "సారూ! ఇదిగో మీ పర్స్. ఆటోలో పడిపోయింది. ఇందాక పెట్రోల్ కొట్టిస్తున్న సమయంలో చూసిన" అంటూ పర్స్ అందిస్తున్న నాగయ్య వైపు కృతజ్ఞతగా చూశాడు. జనార్ధన్‌రావు పర్స్ ఓపెన్ చేసి డబ్బులు లెక్క పెట్టుకున్నాడు. తన దగ్గర వున్న పది వేల రూపాయలు అన్నీ ఐదు వందల నోట్లు సరిగ్గానే ఉన్నాయి.

"ఇగో! ఈ పైసలు తీసుకో" అంటూ ఓ ఐదొందల నోటు తీసి అందిస్తున్న పెద్దాయనతో– "సారూ! మీరిచ్చిన నూట యాభై ఓ.కే" "అట్లనకు నాగయ్య! గీ పైసలు తీసుకో" "వద్దు సారు.. ఆ పైసలు మీవి. మీ కష్టార్జితం. నేను ఆటో నడిపినందుకు మీరిచ్చిన పైసలు చాలు. నిజాయితీకి విలువ కట్టలేరు ఎవరైనా. మీ పైసలు మీ తానకు చేరినయి. అదే ఆనందం నాకు. మల్లొకసారెప్పుడైనా మీరు ఇటుగా రావాలనుకుంటే నా ఆటోనే ఎక్కండి. నా అడ్డా క్లాక్ టవర్ సెంటర్. ఉంటాను సారు" అంటూ అతడు వెళుతున్న వైపు చూస్తుండి పోయాడు జనార్ధన్‌రావు.

మంచితనం, నిజాయితీ మనుషుల్లో ఇంకా బతికే ఉంది. ఎవరో కొందరు చేస్తున్న అవినీతి, మోసాలు వలన సమాజాన్ని నిందించనవసరం లేదు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ ఇప్పుడు జరిగిన సంఘటన అనుకున్నాడతను. ప్రయాణం తెచ్చిన అలసట, ఏదో మూల దాగిన తన నిర్లక్ష్యం పర్స్ పోయేలా చేసింది. ఇకముందు ప్రయాణాల్లో జాగ్రత్తగా వుండాలనుకున్నాడు.

...

జనార్ధన రావు మేనేజర్‌గా ప్రమోషన్ మీద "స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్గొండ బ్రాంచ్"కి వచ్చి వారం రోజులే అయ్యింది. ఉదయం పది గంటలప్పుడు బ్యాంకులోకి అడుగు పెడుతుంటే కౌంటర్ దగ్గర ఓ వ్యక్తి లోన్స్ అందించేవాళ్లని ప్రాధేయపడడం కనిపిస్తుంది.

క్యాబిన్‌లోకి వెళ్లాడు. కొద్ది సమయం తర్వాత బెల్ కొట్టాడు జనార్ధన్ రావు. ప్యూన్ ఎదురుగా వచ్చి నిలబడ్డాడు.

"అక్కడ వికాస్ సార్‌తో మాట్లాడుతున్న వ్యక్తిని, వికాస్ సార్‌ని నా దగ్గరికి రమ్మను" అన్నాడు.


"అట్లనే సార్" అంటూ అతను వెళ్లి వాళ్లిద్దరితో "సార్ మిమ్మల్ని రమ్మంటున్నారు" అన్నాడు. జనార్ధన రావుని చూస్తూనే నాగయ్య ఆశ్చర్యపోతూ "సార్! నమస్తే" అన్నాడు.


"ఏం నాగయ్యా! ఈడికొచ్చినవ్ ఏం పని?" "సార్! నాది అద్దె ఆటో. సొంతంగా ఆటో కొనాలని లోన్ కోసం వచ్చిన. గత మూడు నెలల నుండి వీళ్ల రేపు రా, మాపురా అని తిప్పుకుంటున్నారే కానీ లోన్ ఇవ్వట్లే! నా తాన వున్న ఇంటిపేపర్లు తనఖా పెడతా అంటున్నా చూద్దాంలే అంటున్నారు. కొత్త ఆటో కొనుక్కోవాలని నా కోరిక. కానీ అది అయ్యేట్లు లేదు సారు".


"ఏం వికాస్ సార్?" "సార్, నిజానికి ఇతడి పని ఎప్పుడో కావలసింది. కానీ గతంలో ఉన్న మేనేజర్ సార్..." ఆపై చెప్పలేక ఆగిపోయాడు.

"గతంలో ఉన్న మేనేజర్ అవకతవకలు, లంచగొండి వ్యవహారాలు హెడ్ ఆఫీస్‌లో తెలిసే కదా తనని ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ చేసి అతడిని సస్పెండ్ చేసింది. వేలల్లో జీతాలు వస్తున్నా ఇంకా అత్యాశకు పోతూ తమ వ్యక్తిత్వాన్ని దిగజార్చుకుంటూ అవినీతిపరుడు అన్న కళంకంతో ఉద్యోగ బాధ్యతల నుండి సస్పెండ్ అవుతున్న వ్యక్తి, ఎంతటి విద్యావంతుడైనా ఎన్ని రకాల క్వాలిఫికేషన్స్ వున్నా అవన్నీ ఒక్కసారిగా నిరుపయోగం అవుతాయి" అని మనసులో అనుకున్నాడు జనార్ధన్ రావు. అదంతా చెప్పి తన ఆఫీస్ పరువు తీసుకోలేక "రేపు వచ్చి కలువు. ఏమేం డాక్యుమెంట్స్ కావాలో వికాస్ సార్‌ని అడిగి తెలుసుకో. నీ పని అయిపోతుందిలే" అన్నాడు భరోసాగా మేనేజర్ జనార్ధన్ రావు. "సరే సార్" అంటూ సంబరంగా బయటకు నడిచాడు నాగయ్య.

అవినీతిపరులని తెలిసీ, తీసుకున్న లోన్లు ఎగబెట్టేవాళ్లకి వేగంగా లోన్లు ఇచ్చి సగౌరవంగా పలకరించే బ్యాంకువాళ్లు తమ పద్ధతి మార్చుకుని ఇలాంటి సామాన్యుల గురించి కాస్త ఆలోచిస్తే తప్పకుండా సమాజానికి మంచే జరుగుతుంది. నిజాయితీగా లోన్స్‌కి కిస్తీలు కట్టేవాళ్లని తన ఇరవయ్యేళ్ల బ్యాంక్ సర్వీసులో ఎందరినో చూశాడు జనార్ధన్ రావు. తను ఒకరికి మంచి చేస్తున్నానన్న సంతృప్తితో తన ఎదురుగా వున్న శ్రీ వేంకటేశ్వరుని క్యాలెండర్ వైపు చూస్తున్నాడు అతడు ■


రంభను చూసి టెంప్ట్ అయ్యే వయసా
సామీ నది.. మీరు మరీనూ... !!?
Zakir...


యంగ్ బ్లడ్డే కదా సిస్టర్...!!
ఆపరేషన్...
Zakir...


ఏమండీ... మీరు 'మమ' అనుకోండి...!!
Zakir...

ఈ వారం కా‘ర్ట్యూన్స్’

ఫోటో ఫీచర్



ఇండోనేషియాలోని పలకిరి తీరంలో ఉన్న చెట్లకు సంబంధించిన చిత్రాలివి. ఈ చెట్లు మరుగుజ్జు రకానికి చెందినవి. ఇవి నృత్యం చేస్తున్నట్లు కనిపిస్తాయి. అందుకే వీటిని 'నర్తించే చెట్లు' అంటారు.

